## పహల్గాం ఉగ్రదాడి మృతులకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ నివాళులు

ఈ నెల 22న పహల్గాం సమీపంలోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు జరిపిన క్రూరమైన దాడిలో మరణించిన పర్యాటకులకు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ నివాళులు అర్పించింది. వారి మరణాలపట్ల సంతాపం ప్రకటించింది. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. గత మంగళవారం జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులే లక్ష్యంగా కాల్పులు జరిపి 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. వారిలో 25 మంది భారతీయులు, ఒకరు నేపాల్ జాతీయుడు ఉన్నారు. ఈ ఉగ్రదాడి నేపథ్యంలో ఇవాళ జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైంది. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన అందరు ఎమ్మెల్యేలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఉగ్రదాడిపై సభలో చర్చించారు. అనంతరం మృతులకు నివాళి అర్పించారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :57 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: మంగళవారం 29-04-2025 | పేజీలు:4 వెల: 2.00


## పాతబస్తీలో ఈడీ అధికారుల సోదాలు.. ఎందుకంటే?



హైదరాబాద్,పాతబస్తీలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలో పలువురు ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులకు షాక్ తగిలింది.

భూదాన్ భూముల వ్యవహారంలో సీనియర్ అధికారులపై సంచలన ఆరోపణలు వచ్చాయి. మహేశ్వరం మండలం నాగారంలో సర్వే నంలో భూదాన్ భూములను లే అవుట్ చేసి అమ్మిన వాళ్లపై ఈడీ సోదాలు నిర్వహించింది.. మునావర్ ఖాన్, ఖదీర్ ఉన్నిసా, సర్ఫానా, సుఖుర్ ఇళ్లపై ఈడీ సోదాలు చేపట్టింది. భూదాన్ భూముల వ్యవహారంపై ఇటీవల హైకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే.. ఆల్ ఇండియా సర్వీసెస్ తాజా మాజీ అధికారుల పాత్రపై హైకోర్టు మండిపడింది. ఉన్నతాధికారులకు పాత్రపై విచారణ జరిపించాలని హై కోర్టులో పిటిషన్ దాఖలైంది.. రెవెన్యూ అధికారుల సాయంతో ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి కుటుంబ సభ్యుల పేర్ల మీద భూములు బదలాయింపులు చేసినట్లు ఆరోపణలున్నాయి.. ఈ అంశంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఈడీ, సీబీఐలకు హై కోర్టు నోటీసులు జారీ చేసింది. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. అధికారులకు నోటీసులు ఇచ్చి విచారణ జరిపే అవకాశం ఉంది.

## ఐటి గురించి మాట్లాడితే ఆశ్చర్య పోయారు

అమరావతి,ఏప్రిల్28: తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్య పోయారని, ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటర్స్ రాబోతున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ అంతా ఐటీదేనని అప్పట్లో తల్లిదండ్రులకు పిలుపునిచ్చామని చెప్పారు. స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. 'ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉంటారు. అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారన్నారు. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది. ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయి. మీరు ఉద్యగంలో సంతృప్తి చెందవద్దు.. కొత్త సంస్థలు స్థాపించండి. సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే. తీవ్రవాదం సమస్యలు భారత్‌ను ఏమీ చేయలేవు' అని చంద్రబాబు అన్నారు. వచ్చేనెల 2న ప్రధాని మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని రాక కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తోంది ఏపీ ప్రభుత్వం .. లక్షలాదిగా రైతులు, ప్రజలు తరలి రావడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.. సెక్రటేరియట్ వెనుక స్థలంలో అతిపెద్ద సభ ఏర్పాటు చేస్తున్నారు.. ఆ ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు..అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని మోడీని సీఎం స్వయంగా ఆహ్వానించారు.. సభకు ప్రధాని మోడీ, మధ్యాహ్నం



3:25కి వస్తారు.. 3:32కి వేదిక మీదకు వస్తారు.. 3:50కి 11 నిముషాల అమరావతి పనుల వీడియో ప్లే అవుతుంది.. 4:05 నుంచి 40 నిముషాలు ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తారు.. ఆ తరువాత ప్రధాని నరేంద్ర మోడీ బయల్దేరి వెళ్తారు? అయితే? మోడీ రాక సమయంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు ఉంటాయి.. అలాగే రైతులు చేరుకోవడానికి కావాల్సిన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని సీఎం ఆదేశించారు. ఇకపై ప్రధాని మోడీ పర్యటన పూర్తయ్యే వరకు ప్రతీరోజూ సీఎం సమీక్షలు నిర్వహించనున్నారు..ఈ సందర్భంగా మహాత్మా గాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులుంటారని, అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారని అన్నారు. తెలుగువాళ్ల జనాభా 5 శాతమే.. ఐఐటీల్లో సీట్లు మాత్రం 20 శాతం మనోళ్లవే అని వ్యాఖ్యానించారు.

## ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారు..



హైదరాబాద్: బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. బీజేపీ గురించి నిన్నటి సభలో కేసీఆర్ కనీసం మాట్లాడలేదని అన్నారు. కేసీఆర్ గాంధీ కుటుంబం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నిన్నటి సభలో కేసీఆర్ మాట్లాడిన తీరును ఖండిస్తున్నామని అన్నారు. ఆ సభలో జనాలకంటే ఎక్కువ విస్కీ బాటిల్స్ ఉన్నాయని ఎద్దేవా చేశారు. సభలో మహిళలు కనిపించలేదని అన్నారు. ఇవాళ(సోమవారం) గాంధీభవన్‌లో మహేష్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిపై కేసీఆర్ చర్చకు సిద్ధమా అని మహేష్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. అధికారం నుంచి దిగిపోయిన తర్వాత కూడా కేసీఆర్ అబద్ధాలతో మభ్యపెట్టడానికి చూస్తున్నారని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. అతి తక్కువ సమయంలో ప్రజాధనాన్ని దోచుకున్న కుటుంబం కేసీఆర్‌దని ఆరోపించారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబం గురించి మాట్లాడే స్థాయి కేసీఆర్‌ది కాదన్నారు. దొంగ పాసుపోర్టులు చేసుకునే కేసీఆర్‌కు కాంగ్రెస్ గురించి మాట్లాడే అర్హతే లేదని అన్నారు. కాంగ్రెస్ వల్లే కేసీఆర్ కుటుంబం ఈ స్థాయిలో ఉందని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత సోనియగాంధీ తెలంగాణ ఇవ్వటం వల్లనే కేసీఆర్ కుటుంబం కాస్ట్లీ కార్లలో తిరుగుతుందని ఆరోపించారు. కేసీఆర్ దరిద్రపు, దుష్టపాలన గురించి ప్రజలు మరిచిపోయారని అనుకున్నావా.. ఎప్పటికీ మర్చిపోరని మహేష్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. 420 వైఫల్యాలు కేసీఆర్‌వి ఆయన చేసిన మోసాల గురించి సభలో ఎందుకు చెప్పుకోలేదని మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. కనీసం ఆలోచన లేకుండా కేసీఆర్ తన కుటుంబం బాగుకోసం కాళేశ్వరం కట్టారని విమర్శించారు. తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చిన వారికి ఒక్క పదవి ఇవ్వకపోగా ..తన కుటుంబానికే అన్ని పదవులు కట్టబెట్టారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్‌లో మాట్లాడుకునే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో విద్య, వైద్యం నిర్లక్ష్యం చేయడం వాస్తవం కాదా అని నిలదీశారు. కేసీఆర్ హయాంలో వడ్ల కుప్పలపై రైతులు ఆత్మహత్యలు చేసుకున్నది మర్చిపోయారా అని ప్రశ్నించారు. తాము చేసిన కులగణనపై కనీసం కేసీఆర్ నోరు విప్పలేదని మండిపడ్డారు. కవిత, హరీష్ రావుని సభలో పట్టించుకోలేదన్నారు. జన్వాడ ఫాంహౌస్ ఎవరివి.. వాటికోసం జీవోలు మార్చారని ఆరోపించారు. కేసీఆర్ పర్మినెంట్‌గా ఫాంహౌస్‌కే పరిమితం కావాలని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. ప్రజల సొత్తుని అన్నిరంగాల్లో దోచుకున్నారని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు.

## టీవీకే చీఫ్ విజయ్ బ్లాక్‌లో టికెట్లు అమ్మాడు..

చెన్నై:తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్ పై డీఎంకే మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం విమర్శలు గుప్పించారు. గతంలో విజయ్ బ్లాక్ టిక్కెట్లు అమ్మిన వ్యక్తి ఇప్పుడు అవినీతి గురించి ప్రసంగాలు ఇస్తున్నాడు అని మండిపడ్డారు. అతను తన తల్లిదండ్రులతో కూడా జీవించలేని స్థితిలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని కాపాడటం గురించి మాట్లాడుతున్నాడని పరోక్షంగా విమర్శలు చేశారు. ఇక, 'టీవీకే' అంటే ఏమిటి అని డీఎంకే కార్యకర్తలను అడిగ్గా.. 'త్రిష', 'కీర్తి సురేష్' అని పార్టీ శ్రేణుల నుంచి వాయిస్ వినిపించడంతో.. మీకు అన్ని విషయాలు తెలుసంటూ మంత్రి వ్యంగ్యంగా అన్నారు. అయితే, రాష్ట్రాన్ని నడపడం అంటే సినిమాలో నటించడం లాంటిదని వారు ( టీవీకే చీఫ్ విజయ్) భావిస్తున్నాం`ని మంత్రి ఎంఆర్‌కే పన్నీర్ సెల్వం పేర్కొన్నారు. అయితే, మార్చి 28వ తేదీన జరిగిన పార్టీ మొదటి జనరల్ బాడీ సమావేశంలో టీవీకే అధినేత విజయ్ మాట్లాడుతూ.. డీఎంకేను తీవ్రంగా విమర్శించాడు.. 2026 అసెంబ్లీ ఎన్నికలు




టీవీకే- డీఎంకే మధ్య ప్రత్యక్ష యుద్ధం స్టార్ట్ అవుతుందన్నారు. దీంతో పాటు గౌరవనీయులైన ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్, మీ పేరులో ధైర్యం ఉంటే సరిపోదు.. దానిని మీ పనిలో కూడా చూపించాలి అంటూ సెటైర్లు వేశారు.

## కేసీఆర్‌కు నేను సీఎం అయిన రెండో రోజే గుండె పగిలింది

హైదరాబాద్,బీఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిన్న వరంగల్ ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ భారీ సభ నిర్వహించారు. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈ సందర్భంగా మావోయిస్టుల అంశంపై జానారెడ్డితో చర్చ జరిగినట్లు చెప్పారు. గతంలో మావోయిస్టులతో చర్చలు నిర్వహించిన అనుభవం జానారెడ్డి, కేకే (కే.కేశవరావు) దగ్గర ఉందని, ఇప్పుడు కూడా అదే విధంగా వ్యవహరించేందుకు అధిష్టానం నిర్ణయాన్ని ఎదురుచూస్తున్నామని వెల్లడించారు. పార్టీ హైకమాండ్ కు సమాచారం ఇచ్చి, పీస్ కమిటీ రిక్వెస్ట్ పంపిస్తామని తెలిపారు. తాను సీఎం అయిన రెండో రోజే కేసీఆర్ గుండె పగిలిపోయిందని ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అనర్థాలకు కేసీఆర్ బాధ్యత వహించాలని, రాష్ట్ర ఖజానాను లూటీ చేసింది కేసీఆర్ ని ఆయన మండిపడ్డారు. ఆయన స్పీచ్ అంతా అక్కసుతో నిండి ఉందని విమర్శించారు. కేసీఆర్ సభకు అవసరమైనన్ని బస్సులు సమకూర్చినప్పటికీ, గతంలో ఖమ్మంలో రాహుల్ గాంధీ సభకు బస్సులు ఇవ్వకపోవడం మోసపూరిత చర్య అని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసుల గురించి రేవంత్ మాట్లాడుతూ.. చట్టం మేరకే చర్యలు తీసుకుంటామని, కేసీఆర్ లాగా నేను చట్టాన్ని అతిక్రమించను అని ఆయన అన్నారు. కేటీఆర్ మీద ఉన్న కేసులు కూడా చట్ట ప్రకారమే సాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, అసెంబ్లీ సమావేశాల్లో తాను చేసిన వ్యాఖ్యలే కేసీఆర్ సభలో పునరావృతం చేశారని విమర్శించారు. కేటీఆర్, హరీష్ రావులను చిన్నపిల్లలుగా పేర్కొన్న వ్యాఖ్యలు



కూడా కేసీఆర్ తీరుని ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. నాకు రాహుల్ గాంధీతో మంచి మైత్రి ఉందని, ఇది ఎవరు నమ్మినా, నమ్మకపోయినా నాకు పరవాలేదన్నారు. రాహుల్ గాంధీకి.. నాకు తెలిస్తే చాలు.. బయట ఎవరేం అనుకుంటున్నారు అనేది నాకు అనవసరమని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేయలేకపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కొంత మంది అధికారుల పని తీరు తెలిసినా, అవసరంగా ఉన్న కారణంగా వారి సేవలను కొనసాగించాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ల మార్పు వేరే విషయమని, అవసరమైన మార్పులు చేసుకుంటామని వివరించారు. నన్ను నమ్ముకున్న వారిని నేను ఎప్పటికీ మర్చిపోనని, నన్ను నమ్మిన వారిలో ఒకరైన దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి వచ్చిందని చెప్పారు. ఓపికగా ఉన్న వారికే తన నుండి బాధ్యతలు వస్తాయని, బయటకి వెళ్లి విమర్శలు చేస్తే తనపై బాధ్యత ఉండదని అన్నారు.

## పహల్గామ్ దాడిపై అసెంబ్లీలో ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం



శ్రీనగర్ :పహల్గామ్ ఉగ్ర దాడిని ఖండిస్తూ జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆసక్తికర ప్రసంగం చేశారు. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత దేశంలోని ప్రతి ప్రాంతం ఆవేదనకు గురైందన్నారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు.. తూర్పు నుంచి పడమర వరకు ఇలా ప్రతి ప్రాంతం దిగ్భ్రాంతికి గురైందని గుర్తుచేశారు. ఉగ్ర దాడి తర్వాత కాశ్మీర్ అంతా ఐక్యంగా ఉందని గుర్తుచేశారు. ఇక లోయలో ఉగ్రవాదం అంతం కావడం ఖాయమన్నారు. ఇక ఉగ్ర దాడిలో చనిపోయిన 26 మంది పేర్లను సభలో చదివి వినిపించారు. ఈ దాడిలో తండ్రులను కోల్పోయిన పిల్లలకు తాను ఏం సమాధానం చెప్పాలని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వం బాధ్యతగా పర్యాటకులను ఆహ్వానించింది.. కానీ వారికి భద్రత కల్పించలేకపోయామన్నారు. క్షమాపణ చెప్పడానికి కూడా మాటలు రావడం లేదని.. తండ్రులను కోల్పోయిన పిల్లలకు గానీ.. భర్తలను కోల్పోయిన వితంతువులకు ఏం సమాధానం చెప్పాలన్నారు. తాము ఏం తప్పు చేశామని వాళ్లంతా అడుగుతున్నారని.. సమాధానం చెప్పలేకపోతున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్ష నాయకుడు సునీల్ శర్మ ప్రశంసించారు. అలాగే ఉగ్రవాద దాడిని ఖండించారు. అఖిలపక్ష సమావేశాన్ని పిలిచినందుకు ముఖ్యమంత్రిని, ప్రత్యేక సమావేశాన్ని పిలిచినందుకు అసెంబ్లీ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్‌ను ప్రశంసించారు.

## ప్రజలను మభ్య పెట్టే యత్నంలో కెసిఆర్

హైదరాబాద్,బిఆర్ఎస్ వజ్రోత్సవ సభవల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని, గెలుస్తామని ప్రకటించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప మరోటి లేదన్నారు. కేవలం మభ్య పెట్టే యత్నాల్లో కెసిఆర్ ఉన్నారని విమర్శించారు. బిఆర్ఎస్ తన పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయలేదో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశానికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కాకపోతే.. అంతర్జాతీయ రాష్ట్ర సమితి పెట్టుకోవాలని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తెరాస పతనం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టడానికి, భాజపాను విమర్శించడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికే వజ్రోత్సవ సభ నిర్వహించిందని సంజయ్ విమర్శించారు. 9ఏళ్ల పాలనలో తెరాస ఏం చేసిందో, భవిష్యత్తులో ఏం చేయబోతుందో చెప్పకుండా భాజపా లక్ష్యంగానే సమావేశాలు నడిచాయని అన్నారు. రాష్ట్రంలో తెరాస పతనం మరింత ప్రారంభమైందని అభిప్రాయపడ్డారు. ఆ తీర్మానాల వల్ల రాష్ట్రానికి, దేశానికి ఎలాంటి ప్రయోజనం లేదని అభిప్రాయపడ్డారు. మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థపై విమర్శలు చేసిన కేసీయార్ తెలంగాణ ఆర్థిక వ్యవస్థను అప్పులపాలు చేసిందినిజం కాదా అని ప్రశ్నించారు. మోదీ విధానాల్ని ఇతర దేశాల అధినేతలు ప్రశంసించిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు ఈఎస్ఐ, సహారా కుంభకోణాలు వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. భాజపా మతతత్వ పార్టీ అన్న కేసీఆర్ విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. దేశానికే ఎంఐఎం పార్టీ క్యాన్సర్ లాంటిదని, అలాంటి క్యాన్సర్ గొంతులో



వేసుకున్నది కెసిర్ అని ఎదురుదాడికి దిగారు. ఎంఐఎం మతపార్టీ కాదా అని ప్రశ్నించారు. అవకాశమిస్తే కేసీఆర్ ముస్లింలకు 20శాతం రిజర్వేషన్లు కూడా అమలు చేస్తారని విమర్శించారు. కాంగ్రెస్- తెరాస ఒకటేనన్న సంజయ్.. కాదని చెప్పినా జనం నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. భాజపాను ఒంటరిగా ఎదుర్కోలేక భాజపాయేతర పక్షాలు ఒక్కటవుతున్నాయని, ఎన్ని కూటములు ఏర్పడినా..తెలంగాణలో తదుపరి భాజపాదే అధికారమని స్పష్టం చేశారు. మహిళా గవర్నర్‌కు రాష్ట్రంలో కనీస గౌరవం దక్కడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే ఆయా గ్రామాలు అభివృద్ధి చెందాయని, అవార్డులు పొందాయని గుర్తు చేశారు. లక్షల కోట్ల అప్పులున్న తెలంగాణ ధనిక రాష్ట్రమా. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలిచ్చే పరిస్థితి లేదు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి కేసీఆర్ కుటుంబం సంపాదించుకుందని బండి సంజయ్ విమర్శించారు.

## మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ ఛైర్ పర్సన్ గా శాంతి కుమారి



హైదరాబాద్ : మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం వైస్ చైర్ పర్సన్ గా సీనియర్ ఐఏఎస్ అధికారిణి శాంతికుమారిని నియమించారు.. ప్రస్తుతం ఆమె రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు.. ఆమె ఈ నెల 30 వ తేదిన పదవీ విరమణ చేయనున్నారు.. ఈ నేపథ్యంలోనే ఆమెకు ఎంసిఆర్ హెచ్ ఆర్డీ వైస్ ఛైర్మన్ గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.. ఆమె నియామకం మే ఒకటో తేది నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది.. కాగా కొత్త ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావును ప్రభుత్వం నియమించింది.. ఆయన కూడా మే ఒకటో తేదిన రాష్ట్ర చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## సంపాదకీయం

మంగళవారం 29-04-2025

### కైలాస పర్వత యాత్రకు పచ్చజెండా

భారత్, చైనాల మధ్య సంప్రదింపులు, సమన్వయ సాధన కోసం పనిచేసే యంత్రాంగం ఇటీవల నిర్వహించిన 33వ సమావేశంలో కైలాస మానసరోవర యాత్ర అంశం ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణాత్మకంగా, సానుకూల వాతావరణంలో సాగిన ఈ సంప్రదింపులు వాస్తవాధీనరేఖ దగ్గర నెలకొన్న పరిస్థితిని సమగ్రంగా సమీక్షించాయని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.ప్రఖ్యాత ఆధ్యాత్మిక క్షేత్రాలైన కైలాస పర్వతం, మానసరోవరాల సందర్శనకు అడ్డంకులు తొలిగాయి. చైనా భూభాగం గుండా పర్యటన సాగించేందుకు యాత్రికులకు అనుమతి లభించిందని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి జైస్వాల్ ఇటీవల ప్రకటించారు. ఈ పరిణామాన్ని భారత్, చైనాల మధ్య సయోధ్యకు సూచనగా భావిస్తున్నారు. భారత్, చైనాల మధ్య సంప్రదింపులు, సమన్వయ సాధన కోసం పనిచేసే యంత్రాంగం ఇటీవల నిర్వహించిన 33వ సమావేశంలో కైలాస మానసరోవర యాత్ర అంశం ప్రస్తావనకు వచ్చింది. నిర్మాణాత్మకంగా, సానుకూల వాతావరణంలో సాగిన ఈ సంప్రదింపులు వాస్తవాధీనరేఖ దగ్గర నెలకొన్న పరిస్థితిని సమగ్రంగా సమీక్షించాయని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ద్వైపాక్షిక సంబంధాలు సాఫీగా సాగాలంటే సరిహద్దుల వెంబడి శాంతి పరిఢవిల్లడం ఎంతో అవసరం. నిరుడు డిసెంబరులో బీజింగ్‌లో జరిగిన ప్రత్యేక ప్రతినిధుల సమావేశంలో ఇండియా, చైనా సరిహద్దు విషయంలో తీసుకున్న నిర్ణయాలకు కార్యరూపం ఇచ్చేందుకు తగిన చర్యలు, ప్రతిపాదనలపై ఇరుపక్షాలు దృష్టి సారించాయి. లక్ష్యసాధన కోసం అవసరమైన దౌత్య, సైనిక యంత్రాంగాలను కొనసాగించడంతోపాటు, వాటిని బలోపేతం చేయడానికి ఇరుపక్షాలూ అంగీకరించాయి. నదీజలాలు, కైలాస మానసరోవర యాత్ర పునరుద్ధరణ విషయంలో సరిహద్దు వెంబడి పరస్పర సహకారం పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది.

కఠిన వాతావరణంలో...

చైనాలోని టిబెట్ అటానమస్ ప్రాంతంలో ఉన్న కైలాస పర్వతాన్ని, మానసరోవరాన్ని సందర్శించడం ఎంతోపుణ్యం కల. హిందువులు, బౌద్ధులు, జైనులు ఈ యాత్రను అతి పవిత్రమైనదిగా భావిస్తారు. హిందువులు కైలాస పర్వతాన్ని పరమ శివుడి నివాసంగా భావిస్తారు. కఠినమైన భూభాగాలు, ఎత్తయిన పర్వత ప్రాంతాల గుండా కఠోర వాతావరణ పరిస్థితుల్లో యాత్ర సాగుతుంది. ప్రపంచ పర్యాటకుల్లో అతి క్లిష్టమైన యాత్రగా ఇది పేరుపొందింది. జూన్ నుంచి సెప్టెంబరు వరకూ జరిగే ఈ యాత్రను విదేశాంగ శాఖ రెండు మార్గాల గుండా నిర్వహిస్తుంది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ ద్వారా ఒక మార్గం, సిక్కింలోని నాథులా పాస్ గుండా సాగేది మరో మార్గం. ఏటా వందలాది మంది ఈ యాత్రలో పాల్గొంటారు. యాత్రికులకు భారత ప్రభుత్వం మంజూరు చేసిన పాస్‌పోర్టు అవసరం. యాత్రలో భాగంగా సముద్ర మట్టానికి సుమారు 19500 అడుగుల ఎత్తులో ఉండే ప్రాంతాల్లో నడక సాగించాల్సి ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లో సంక్లిష్ట భూభాగంగుండా ప్రయాణించేందుకు యాత్రికులు భౌతికంగా, ఆరోగ్యపరంగా బలిష్ఠంగా ఉండాలి. ఉత్తరాఖండ్, ఢిల్లీ, సిక్కిం ప్రభుత్వాల తోడ్పాటుతో, ఇండో టిబెటన్ సరిహద్దు పోలీసుల(ఐటీబీపీ) సహకారంతో యాత్ర నిర్వహిస్తారు. భారత భూభాగంలో కుమావ్ మండల్ వికాస్‌నిగమ్, సిక్కిం టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వాటి అనుబంధ సంస్థలు సదుపాయాలు కల్పిస్తాయి. ఢిల్లీ హార్ట్ అండ్ లంగ్ ఇన్‌స్టిట్యూషన్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుంది.

చేదుగతాన్ని దాటి...

కైలాస మానసరోవర యాత్రపై గతంలో చైనా ఆంక్షలు విధించిన ఉదంతాలు అనేకం. టిబెట్‌లో కొండచరియలు విరిగి పడుతున్నాయన్న సాకుతో 2017లో నాథులా పాస్ గుండా యాత్రకు డ్రాగన్ అనుమతి ఇవ్వలేదు. ఇరుదేశాల మధ్య దీనిపై దౌత్య సంప్రదింపులు కూడా జరిగాయి. 2023 నుంచీ చైనా భారతీయ యాత్రికులపై మరిన్ని కఠిన నిబంధనలు విధించింది. ఇందులో భాగంగా ప్రవేశ రుసుమును భారీగా పెంచేయడంతోపాటు బయోమెట్రిక్ సమాచారాన్ని సమర్పించడం తప్పనిసరి చేసింది. వీటిని యాత్రికులను నిరుత్సాహ పరిచేందుకు ఉద్దేశించిన చర్యలుగా భావించారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ దాని ప్రభావం కైలాస మానసరోవర యాత్రపై పడటం మామూలైపోయింది. యాత్రపై చైనా విధించే ఆంక్షలు ఇరుదేశాల దౌత్య సంబంధాలను ప్రతిబింబిస్తుంటాయి. 2020లో తూర్పు లద్దాఖ్ ప్రాంతానికి సంబంధించి తలెత్తిన ఘర్షణ యాత్రపై చైనా ఆంక్షలకు దారితీసింది. అయితే బ్రిక్స్ సమావేశంలో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య చర్చల అనంతరం ఇరుదేశాల సంబంధాలు మెరుగయ్యాయి. వాణిజ్య రంగంలో స్పర్ధలు ఉన్నా ద్వైపాక్షిక సంబంధాలు సాధారణంగా మారాలని రెండు దేశాలూ కోరుకుంటున్నాయని 'మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్'కు చెందిన ప్రతిభ వివరించారు. ఇండియా, చైనాల మధ్య సహకారం కేవలం రెండు దేశాలకే కాకుండా, ప్రపంచ సుస్థిరతకు, సౌభాగ్యానికీ ఎంతో అవసరమని ప్రధాని మోదీ ఇటీవల పేర్కొనడం గమనార్హం. కైలాస మానసరోవర యాత్రకు సంబంధించిన తాజా పరిణామాలను ఆ కోణంలో చూడాల్సిన అవసరం ఉంది.

# పాక్‌కు ఏది సరిపోయే శిక్ష?



న్యూఢిల్లీ,పహల్‌గామ్‌లో 26 మంది పౌరులను కాల్చి చంపిన భయంకర ఉగ్రదాడి తర్వాత భారత్ లో పాకిస్తాన్ పై ఆగ్రహం పెరుగుతోంది. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) కటువైన ప్రకటన విడుదల చేసింది. దాడి చేయడంలో ఉగ్రవాదులు ప్రదర్శించిన క్రూరత్వాన్ని చూస్తే ఆ ఆగ్రహం ఆశ్చర్యం కలిగించదు. పాక్ మీడియా వ్యాఖ్యాతలు ఇస్లామాబాద్‌ను ఇరికించడానికి భారతదేశమే ఈ దాడిని నిర్వహించిందని దారుణమైన ఆరోపణ చేస్తున్నారు. స్పష్టంగా, వారు ఘోరమైన పరిణామాన్ని ఆశిస్తున్నారు.భద్రతా కేబినెట్ కమిటీ ప్రకటన కావలసిన అన్ని అంచనాలను తీర్చింది. న్యూఢిల్లీలో ఉన్న పాకిస్తాన్ హైకమిషన్ లోని ఛార్జ్ డి'అఫైర్ సహా 14 మంది సిబ్బంది ఇంకా మిగిలి ఉన్నప్పటికీ, పాక్ సైనిక సలహాదారులు, ఇతర సహాయక సిబ్బందిని భారత్ విడిచి వెళ్ళమని ఆదేశించారు. ఇది పాక్ సైనిక సంస్థపై పూర్తిగా నిందను మోపుతుంది. అటారీ చెక్‌పోస్ట్ మూసివేయడం, మిగిలిన వీసా ప్రోటోకాల్స్‌ని నిలిపివేయడం కూడా ఊహించినదే. పాక్‌పై తీవ్రమైన ప్రభావం కలిగించడానికి భారత్ కఠిన నిర్ణయాలు తీసుకోవడం ఆశ్చర్యం కలిగించలేదు. గత సంవత్సరం చివర్లో, సింధునదీ జలాల ఒప్పందంపై తిరిగి చర్చలు జరిగే వరకు సింధునదీ జలాల కమిషన్ సమావేశాలను నిర్వహించడానికి కూడా భారత్ నిరాకరించింది.

కేవలం నిలిపేసింది!

భారత్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ఆలస్యం చేయడానికి పాకిస్తాన్ అతి స్వల్ప కారణాలను చూపుతూ సింధు జలాల ఒప్పందాన్ని ఉపయోగించుకుంటోంది. ఒప్పందంలో ఇరు దేశాల కమిషనర్లు సహా మూడు అంచెల వివాద యంత్రాంగం ఉంది. అది విఫలమైనప్పుడు, 1960లో ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించిన ప్రపంచ బ్యాంకు ఒక తటస్థ నిపుణుడిని నియమిస్తుంది. అది కూడా పని చేయకపోతే, మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయవచ్చు. 1970లలో, భారతదేశం సలాల్ ఆనకట్ట ఎత్తును తగ్గించి, దాని అవుట్‌లెట్‌లను తెరిచి వేయవలసి వచ్చింది. దీనివలన ఆనకట్ట ఉపయోగం తగ్గి భారీగా బురద చేరి, కోతకు గురైంది. మరొక సందర్భంలో, బాగ్లిహార్ ఆనకట్ట (జమ్ము%-%కశ్మీర్) 14 ఏళ్ల ఆలస్యాన్ని ఎదుర్కొంది. కిషన్‌గంగా ప్రాజెక్టు మరింత ఇబ్బందులకు గురైంది. ప్రపంచ బ్యాంక్ నియమించిన తటస్థ నిపుణుడు ఈ విషయాన్ని పరిశీలిస్తున్నప్పుడే పాక్ మధ్యవర్తిత్వ స్థాయికి వెళ్లింది. ప్రపంచంలోనే అత్యంత నీటి కొరత ఉన్న దేశాలలో పాకిస్తాన్ 15వది. భారతదేశం ప్రస్తుతం జలాల ఒప్పందాన్ని కేవలం 'నిలిపివేసింది'. సరిహద్దుకు అవతలి వైపు ఉన్న బాధ్యతాయుతమైన మనుషులు ఈ స్వల్పభేదాన్ని అర్థం చేసుకోవాలి.అయితే, ఇవేవీ భారతదేశ ప్రజల ఆగ్రహాన్ని చల్లార్చలేవు. భద్రతా కేబినెట్ కమిటీ ప్రకటన 'ఇటీవల తహవ్వుర్ రానాను వెనక్కి రప్పించినట్లే, ఉగ్రవాద చర్యలకు పాల్పడిన లేదా వాటిని సాధ్యం చేయడానికి కుట్ర పన్నిన వారిని వెంబడించడంలో భారతదేశం అవిశ్రాంతంగా ఉంటుంది' అని పేర్కొంది. ఉగ్రదాడి తర్వాత ప్రధాని బిహార్‌లో ఉద్దేశపూర్వకంగానే ఇంగ్లీషులో మాట్లాడుతూ, 'భారతదేశం ప్రతి ఉగ్రవాదినీ, వారికి మద్దతు ఇచ్చేవారినీ గుర్తించి, వెంబడించి, శిక్షిస్తుంది. మేము వారిని భూమ్మీద ఎక్కడున్నా దొరికించుకుంటాం' అన్నారు. ఉగ్రవాదాన్ని శిక్షించే చర్యలు దీర్ఘకాలంపాటు కొనసాగుతాయని ఈ ప్రకటన సూచిస్తుంది.

ఎలా దాడి చేయొచ్చు?

కాబట్టి, ఇప్పుడు ఇక్కడ ఏమి సాధ్యమవుతుంది అంటే కచ్చితంగానే బాలకోట్ తరహా దాడి సాధ్యం కాదు. ఈసారి, పాక్ సైన్యం పూర్తి అప్రమత్తంగా ఉంది. స్పష్టమైన ప్రత్యామ్నాయం ఏమిటంటే, నియంత్రణ రేఖ వెంబడి ఉన్న ఉగ్రవాద శిబిరాలను గుర్తించే లక్ష్యంతో భారత భూభాగం నుంచే 290 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించడం.అది భారత్ తనదని చెప్పుకొంటున్న ప్రాంతం కాబట్టి ఇది సాంకేతికంగా పాకిస్తాన్‌పై దాడి కాదు. మరింత కావాల్సిన లక్ష్యం లష్కర్‌తొయిబా కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న మురిద్కే. ఇది లాహోర్‌కు దగ్గరగా, భారత సరిహద్దు నుండి దాదాపు 30 కి.మీ. దూరంలో ఉంది. సాయుధ డ్రోన్ లను ఉపయోగించి కూడా దీనిపై దాడి చేయవచ్చు. దీని వలన కచ్చితత్వంతోపాటు ఎటువంటి ఆనుషంగిక నష్టం ఉండదు.కానీ ఏదైనా సరే, ఎంత సమర్థనీయమైనా సరే, అది యుద్ధ చర్యే. పాకిస్తాన్ సైన్యం ప్రతీకారం తీర్చుకుంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు. బాలకోట్ తరువాత, అది జాగ్రత్తగా దాడి చేసింది. పెద్దగా నష్టం కలిగించకుండా ప్రతిస్పందనను నమోదు చేసింది.

# ఇండియా దాటిపోవడమే లక్ష్యం.. ఎలాగోలా!



న్యూఢిల్లీ,ఒకవైపు ఇండియా పురోగమిస్తోందని, అమెరికా కన్నా ఇండియాకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఇతర దేశాల్లో కన్నా ఇండియాలో జీవితం సాఫీగా సాగేలా భవిష్యత్తు ఉంటుందని ఒక వర్గం ఆర్థిక వేత్తలు ప్రచారం చేసుకుంటూ పోతూ ఉన్నారు. అదేమంటే.. చైనాతో పోలిస్తే, అమెరికాతో పోలిస్తే.. ఇండియాలో ఈ ఏడాదికి వృద్ధి రేటు ఎక్కువ అని వాదిస్తారు!అయితే ఏ ఒకటో అర శాతమో ఎక్కువ వృద్ధి రేటును నమోదు చేసినప్పటికీ, అయితే అమెరికా, చైనాతో సహా ఇతర అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన ఆర్థిక వ్యవస్థ చాలా చిన్నది! ప్రపంచంలోనే ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, ఇంకో రెండేళ్లకు ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ.. జపాన్ ను దాటేశాం.. అనే విశ్లేషణలూ వినిపిస్తూ ఉంటాయి! అయితే జపాన్ జనాభా పన్నెండు కోట్లు, మన దేశ జనాభా 140 కోట్లు! పది రెట్లు పన్నెండు రెట్లు అధిక జనాభా కలిగి ఉన్న ఒక దేశం ఆ దేశ ఆర్థిక వ్యవస్థతో పోల్చుకుని మనం గొప్ప అని జబ్బలు చరుచుకోవడం ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు!సౌత్ కొరియా, చైనా వంటి దేశాలు.. ఒకప్పుడు ఇక్కట్ల విషయంలో ఒకప్పుడు ఇండియాతో సమానమైన స్థాయిలో ఉండేవి. అయితే అవి ఇండియాను ఎప్పుడో దాటేసి వెళ్లాయి, ఇప్పుడు వాటిని అందుకోవడం కూడా ఇండియాకు తేలిక కాదు! ఇండియాలో ఇప్పుడు ట్రెండింగ్ ఏదంటే కాషాయం గట్టామా, రాజకీయం చేశామా, ఏవైనా మసీదులు తవ్వుదామా, మత వివాదాలు రేపుదామా, సోషల్ మీడియాలో వాటిని పోస్టు చేసి రచ్చలు రాజేసుకుని చలి కాచుకుందామా.. అనేది ఇప్పుడు ట్రెండింగ్. ఇది రానురానూ మరింత ముదురుతూ ఉంది. ఎన్నికలు వస్తే.. ముస్లింలను బూచిగా చూపిద్దామా, ఔరంజేబు పేరు చెబుదామా.. ఇదే రాజకీయం! వర్సిటీల్లో కూడా ఆవుపేడే విద్యాంశం అవుతున్నప్పుడు ఇక వాదించేది కూడా ఏముంది!మరి ఈ విషయాలను గ్రహించేనేమో కానీ.. ఇండియాలో ఇప్పటికీ ప్రజలు ఎక్కడికైనా వలస వెళ్దామా అనే ప్రయత్నాల్లో ఉండేలా చేస్తూ ఉంది. అమెరికా వాడు వద్దు వద్దంటున్నా.. ఏదో ఒక పేరుతో అమెరికాకు వెళ్లే వాళ్ల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. అయితే విదేశాలకు భారతీయులు వెళ్లి బాగా సంపాదించుకుని ఇండియాకు పంపుతున్నారు.. అనేది కూడా వాస్తవమే. అయితే ఆ దేశాల్లో తమను శాశ్వతంగా ఉండనివ్వరు అనే భావన ఉన్న వారు లేదా.. అక్కడ మరీ చిన్న స్థాయి పనుల్లో ఉన్న వారు ఇక్కడ పెట్టుబడులకు మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ అప్పులు చేసి అక్కడకు వెళ్లి తీర్చడం లేదా కుటుంబ సభ్యుల పోషణకు అవసరమైన డబ్బులను పంపేవారూ ఎక్కువమందే ఉంటారు. అయితే ఒక స్థాయి ఆర్థిక శక్తి సమకూరిన వారిలో మాత్రం ఎక్కువ మంది శాశ్వత వలసలకు ప్రాధాన్యతను ఇస్తూ ఉన్నారని అధ్యయనాలు చెబుతూ ఉన్నాయి.కనీసం 25 కోట్ల రూపాయల సంపద కలిగిన ప్రతి ఐదు మందిలో ఒకరు ఇప్పుడు ఇండియాను వదిలి వెళ్లడం లేదా, వదిలి వెళ్లిపోయే ప్రయత్నంలో ఉన్నారని ఒక ప్రముఖ ఆర్థిక అంశాల పరిశోధన సంస్థ అధ్యయనం ద్వారా తెలుస్తూ ఉంది!ఈ రోజుల్లో 25 కోట్ల రూపాయల సంపద అంటే.. మరీ బ్రహ్మాండం బద్ధలయ్యే అంశం ఏమీ కాదు. ఎక్కడ చూసినా.. ఎకరం భూమి 20 లక్షల రూపాయల కనిష్ట ధర ఉందిప్పుడు. ఓ మోస్తరు పల్లెటూళ్లు, మండల కేంద్రాలకు సమీపంలో అయితే.. ఎకరం భూమి 40 లక్షల రూపాయల పైనే, అది కోటి రూపాయలు, అంతకు మించి కూడా ఉండవచ్చు. మండల కేంద్రాల్లో అయితే.. ఇప్పుడు ఏరియాలను బట్టి సెంటు భూమి పది లక్షలతో మొదలుపెడితే.. పాతిక లక్షల రూపాయలు కూడా చెబుతూ ఉన్నారు. అక్కడ ఐదు సెంట్ల భూమి ఉన్నా.. కోటి రూపాయలు పైనే! పాతిక కోట్ల రూపాయల ఆస్తి అనేది మరీ బ్రహ్మాండం బద్ధలయ్యే అంశం అయితే కాదు స్థూలంగా!మరి ఈ కేటగిరిని ప్రామాణికంగా తీసుకున్నా కూడా.. ఇలాంటి వారిలో ఐదు మందిలో ఒకరు ఇండియా దాటేస్తున్నారని కోటక్ బ్యాంక్ చేసిన అధ్యయనంలో అర్థమయ్యిందట! ప్రధానంగా సిటీ సెంట్రిక్ గా ఆస్తులను పోగేసుకున్న వాళ్లు ఇలాంటి వలస మార్గాల్లో ఉండవచ్చు! అయినా ఇదేం చిన్న అంశం కాదు. డబ్బున్న వాడు పోతే పోయాడని అనడం తేలికే కానీ.. దేశ ఆర్థిక వ్యవస్థలో ఉన్న అభద్రతకు ఇది ఒక తార్కాణంగా నిలుస్తూ ఉంది. కేవలం ఆర్థికంగానే కాదు, సామాజికంగా కూడా ఇది గొప్ప సందేశం ఏమీ కాదు!పాతిక కోట్ల ఆస్తి ఉంటే చాలు.. విదేశాలకు వెళ్లి సెటిలవుదామనే వారి సంఖ్య గణనీయంగా ఉంది ఇండియాలో అనేది నిష్టూరమైన నిజం. అసలు పాతిక కోట్లు కాదు, ఓ పది కోట్ల రూపాయల ఆస్తులున్నా.. వాటిని అమ్ముకుని ఏదో దేశం వెళ్లిపోయి సెటిలయ్యే ప్రయత్నాల్లో కూడా చాలా మంది ఉన్నారు. ఇక ఇలాంటి డ్రీమ్ ఎంతమందికి ఉంది అని సగటు భారతీయులను అడిగితే.. కొన్ని కోట్ల మంది ఎగబడతారనడంలో కూడా సందేహం లేదు. డ్రీమ్స్ సంగతలా ఉంటే.. ప్రాక్టికల్ గా ఆలోచించి దేశం దాటేస్తున్న శ్రీమంతులు అయితే చాలా మంది తేలుతున్నారు ఇండియాలో. ఒకప్పుడు ఇండియా నుంచి బ్రెయిన్ డ్రెయిన్ అనే వాళ్లు, అయితే వెల్త్ డ్రెయిన్ కూడా గట్టిగానే కొనసాగుతూ ఉంది. 2023 సంవత్సరంలో ఇండియా నుంచి 6,500 మంది మిలియనీర్లు దేశం దాటి వెళ్లిపోయారట, ఇది ఆ తర్వాతి సంవత్సరానికి ఎనిమిదే వేల సంఖ్యకు చేరిందని అంచనా! ఇలా ఇండియా నుంచి దాటి వెళ్లిపోవడానికి ప్రాధాన్యత క్రమంగా పెరుగుతోంది ఆర్థిక శక్తి ఉన్న వాళ్లలో! వీరంతా తాతలు సంపాదించిపెట్టింది కలిగిన వారు, లేదా సొంతంగా వ్యాపారమో చేసి, లేదా ఎలాగోలా ఆ మేరకు ఆస్తులను సంపాదించుకుని.. ఇక ఇండియా తమకు తగిన వేదిక కాదు అని వెళ్లిపోతున్న వాళ్లు! అయితే వీరే కాదు, ఏ ఉద్యోగమో విదేశాల్లో సంపాదించుకుని, లేదా ఏ సర్వీస్ బేస్డ్ కంపెనీ ద్వారా విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లిపోయి, అక్కడ వేరే మార్గాలను అన్వేషించి, అక్కడ శాశ్వతంగా తాము సెటిల్ కావడానికి మార్గాలను పట్టుకుంటున్న వారి శాతం కూడా ఉంటుంది.ఉద్యోగాలకు విదేశాలకు వెళ్లి అక్కడ ఉపాధి మార్గాలను పట్టుకుంటున్న వారు ఈ కేటగిరి. ఇంకో కేటగిరి ఉంది.. ఇండియాలో డిగ్రీలు, పీజీలు కంప్లీట్ చేసి.. ఏ పీహెచ్డీ ల కోసమో విదేశీ వర్సిటీల ఎంట్రన్స్ లు రాసి.. అక్కడ స్పాన్సర్ షిప్ సంపాదించి చదువులు, ఇక మిగిలిన జీవితం అక్కడే అన్నట్టుగా సెటిలవుతున్న వారూ ఉన్నారు. వీరిని బ్రెయిన్ డ్రెయిన్ కేటగిరిలో కలపొచ్చు. అది గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి, ఏ పీహెచ్ డీ అవకాశాలనో విదేశీ వర్సిటీల్లో సంపాదిం అక్కడకు వెళ్లిపోతున్న వారి సంఖ్య కూడా ఈ రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో కూడా చెప్పుకోదగిన స్థాయిలో ఉంది!అంటే.. పాతిక కోట్ల రూపాయల ఆస్తులు చేతుల్లో ఉన్నా ఇండియాలో ఉండటం అనేది ఆప్షనల్! ఏ సర్వీస్ బేస్డ్ కంపెనీలోనో ఐటీ ఉద్యోగం సంపాదించుకుని ఆన్ సైట్ కంటూ వెళ్లి అక్కడ అన్ని మార్గాలనూ అన్వేషించుకుంటూ అక్కడే సెటిలయ్యే అవకాశం ఏ మాత్రం ఉన్నా అంతకన్నా కావాల్సింది ఏమీ లేదు, ఇక బాగా చదవగలిగితే పరిశోధనలో, పీహెచ్డీనో అని విదేశీ వర్సిటీల్లో అవకాశాలను పట్టగలిగిన వారికీ ఇండియా అస్సలు అక్కర్లేదు! ఈ కేటగిరి వాళ్లైతే.. అక్కడ అడుగుపెట్టిన తర్వాత తిరిగి ఇండియాలో జీవితం అనేదాన్ని ఊహించుకోవడం లేదసలు!ఇక తల్లిదండ్రుల చేత అప్పులు చేయించో లేదా ఎడ్యుకేషన్ లోన్లను చేసో.. అమెరికాకు వెళ్లిపోయి అక్కడ క్యాబ్ తోలుకుని అయినా ఇక్కడ చేసిన అప్పులు తీర్చేసి.. అక్రమమార్గాలో, సక్రమ మార్గాల ద్వారానో అమెరికాలోనే ఉండిపోవాలనే కేటగిరి సరేసరి! ఈ మధ్యనే ఆస్ట్రేలియాలో ఈ తరహా ఇండియన్స్ పై దృష్టి పెట్టారట. ప్రత్యేకించి ఉత్తరభారతీయులు కొందరు చదువుల పేరుతో ఆస్ట్రేలియాకు వెళ్లి అక్కడ హొటళ్లు, రెస్టారెంట్లు, ఇంకా ఇతర పనులు చేసుకుంటూ ఉన్నారట! వీరి అటెండెన్స్ గురించి ఆ విద్యాసంస్థల్లో వెళ్లి చూస్తే.. పది పన్నెండు శాతం అటెండెన్స్ కూడా లేదట! దీంతో కొన్ని రాష్ట్రాల నుంచి తమ దేశంలోకి విద్య పేరుతో వచ్చే వారిపై నిషేధాన్ని ప్రకటించేశారు అక్కడ!మరి ఇండియా నుంచి దాటిపోవడానికి ఇండియన్స్ లో చాలా మంది సర్వకాల సర్వావస్థల్లోనూ ప్రయత్నిస్తున్నారనే విషయం స్పష్టం అవుతూ ఉంది, ఆర్థికంగా ఉన్న వారు, లేనివారు, బతకకలిగిన వారు, బతకలేని వారు.. అందరిలోనూ కనిపించే ఉమ్మడి లక్ష్యం.. అవకాశం వస్తే దేశం దాటేయడం!

# పాస్టర్ ప్రవీణ్ మృతిపై అనుమానాలు

రాజమండ్రి,పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఇంకా అనుమానాలు వ్యక్తం అవుతూనే ఉన్నాయి.. అది రోడ్డు ప్రమాదంగా తేల్చిన పోలీసులు.. దానికి సంబంధించిన కొన్ని ఆధారాలను కూడా బయటపెట్టారు.. అయితే, పాస్టర్ ప్రవీణ్ పగడాలది హత్య అనడానికి అనుమానాలు ఉన్నాయని అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్ అన్నారు .. అసలు మృతదేహాన్ని ఘటనా స్థలం వద్దకు వెనుక నుంచి తీసుకువచ్చినట్లుగా నాకు అనుమానం ఉందన్నారు. రీపోస్ట్ మార్టం కోసం హైకోర్టులో పిల్ వేశానని హర్ష కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో నేను వేసిన పిల్ కు సహకరించాలని రాజమండ్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హర్ష కుమార్ కోరారు. మరోవైపు, సీబీఐ విచారణ చేసినా పాస్టర్ ప్రవీణ్ కేసులో న్యాయం జరగదని అభిప్రాయపడ్డారు హర్షకుమార్.. మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు, విశాఖ పోర్టులో డ్రగ్స్ కేసులను సీబీఐ ఏమీ తేల్చలేదని గుర్తు చేశారు. అందుకే సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్ చేస్తున్నానని అన్నారు. వచ్చే నెల 24న పాస్టర్ ప్రవీణ్ ఘటనా స్థలం వద్ద బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు- హర్ష కుమార్ ప్రకటించారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు విధించ వద్దని విజ్ఞప్తి చేశారు. బహిరంగ సభకు కేఏ పాల్ ను ఆహ్వానిస్తానని అన్నారు.. పాస్టర్ ప్రవీణ్ ది హత్య అని నమ్మేవాళ్లు వచ్చేనెల 24న బహిరంగ సభలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇక, సీఎంగా ఉన్న చంద్రబాబును ఏకవచనంతో సంభోదించడం తప్పే, ఫ్రస్టేషన్ లో ఉండి సీఎం చంద్రబాబును ఏకవచనంతో సంభోదించినందుకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు మాజీ ఎంపీ హర్షకుమార్. కాగా, 'నన్ను అరెస్టు చేసి పోలీసులు 5 గంటల పాటు- కారులో తిప్పడం వల్లే అసహనానికి లోనై కోపంలో సీఎంను ఏకవచనంతో మాట్లాడా.. ఆ తర్వాత అలా మాట్లాడినందుకు బాధపడ్డాను అన్నారు.. వ్యక్తిగత విమర్శలు నా స్వభావం కాదు. అవసరమైతే క్షమాపణ చెబుతా. ఏ పార్టీనైనా పొగడటం నాకు చేతకాదు. అంశాల ప్రాతిపదికన విమర్శిస్తాను అంటూ రెండు రోజుల క్రితం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. ఈ రోజు మీడియా సాక్షిగా సీఎం చంద్రబాబుకు క్షమాపణలు చెప్పారు.

# మహారాష్ట్రలో 5వేలమంది పాకిస్థానీలు

ముంబై,పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు వారి స్వదేశానికి వెళ్లిపోవాలని భారత ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే అన్ని రాష్ట్రాలు ఆ దిశగా చర్యలు చేపడుతున్నాయి. అయితే, మహారాష్ట్రలో 5వేల మంది పాకిస్థానీయులు ఉన్నారని, ఇందులో వెయ్యి మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నారని ఆ రాష్ట్రమంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశం విడిచి వెళ్లాలని వారికి సూచించామన్నారు.రాష్ట్రంలో దీర్ఘకాలిక వీసాలపై వచ్చిన వారు 4వేల మంది ఉంటారు. సార్క్ వీసా కింద మరో వెయ్యి మంది ఉన్నారు. వీరిలో సినిమాలు, వైద్యం, జర్నలిజం, వ్యక్తిగత పనులపై రాష్ట్రానికి వచ్చారని మంత్రి యోగేశ్ కదమ్ వెల్లడించారు. పాక్ జాతీయుల్లో కొందరు ఎనిమిది నుంచి పదేళ్లుగా భారత్‌లోనే ఉంటు-న్నారని అన్నారు. కొందరు వివాహం చేసుకోగా.. మరికొందరు పాకిస్థాన్ పాస్‌పోర్టును సరెండర్ చేసి భారత పౌరసత్వం (ఒశ -షఱుఱ) కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. స్వల్పకాలిక వీసాలపై వచ్చిన వారు ఏప్రిల్ 27లోగా వెళ్లిపోవాలని సూచించామని యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. వైద్యం కోసం వచ్చిన వారికి మాత్రం అదనంగా మరో రెండు రోజులు గడువు ఉంటు-ందన్నారు. ఇదిలాఉంటే, పహల్గాంలో ఉగ్రదాడిలో పాకిస్థాన్ హస్తం ఉందని పేర్కొన్న భారత్.. మన దేశంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు స్వదేశానికి వెళ్లిపోవాలని ఆదేశించింది. అట్టారీ-వాఘా సరిహద్దును మూసివేస్తున్నట్లు- ప్రకటించింది.

# కొల్లేరు కాంటూరు కుదించండి

ఏలూరు, కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి.. ఉపాధి, అభివృద్ధి పనులు చేపట్టి ప్రభుత్వం అక్కడి ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. కొల్లేరు గ్రామాల్లో శనివారం సిపిఎం బృందం పర్యటించింది. మాధవపురం పక్షుల కేంద్రం, పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించింది. గుడివాకలంక, కొవ్వాడలంక గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు ఘంటసాల నాగరాజు, జయమంగళ తిరుపతి వెంకన్న అధ్యక్షతన జరిగిన సభల్లో అక్కడి గ్రామస్తులు తాతపూడి చందు, దొరబాబు, కొల్లేరు నాయకులు ఘంటసాల వెంకటలక్ష్మి, ఘంటసాల మహాలక్ష్మిరాజు, ఇతర పెద్దలు మాట్లాడారు. 2006 నుంచి వారు పడుతున్న కష్టనష్టాలను చెబుతూ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఉపాధి లేక ఇక్కడి ప్రజలు వలసపోతున్నారని, అభివృద్ధి పనులు పూర్తిగా నిలిపివేశారని తెలిపారు. ఐదో కాంటూరులో లేని గ్రామాలను సైతం ధ్వంసం చేశారని, జిరాయితీ భూములను సైతం ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొవ్వాడ లంక, తదితర గ్రామాల ప్రజలకు సెంటు-భూమి కూడా లేకుండా పోయిందన్నారు. ఆది నుంచి కొల్లేరు గ్రామాల ప్రజలకు సిపిఎం అండగా ఉందని, గతంలో నిర్వహించిన ఉద్యమాలను గుర్తు చేశారు. తమ సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆయా సభల్లోనూ, పెద ఎడ్లగాడి వంతెనపై మీడియాతోనూ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ భవిష్యత్తు ఏమిటనే భయం కొల్లేరు ప్రజల్లో కనిపిస్తోందన్నారు. మూడు, ఐదు కాంటూరుల మధ్య మూడు లక్షల మంది ప్రజలు నలిగిపోతున్నారని తెలిపారు. పర్యావరణానికి ఎవరూ వ్యతిరేకం కాదని, ఇక్కడి పక్షులు, ప్రజలు ఎప్పటి నుంచో కలిసిపోయారని అన్నారు. జబ్బు ఒక-టైతే మందు మరొకటి వేస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. అప్పట్లో జలగం వెంగళరావు ప్రభుత్వం 118 జిఒ ద్వారా సొసైటీ-లు ఏర్పాటు- చేసి చేపల చెరువులను ప్రోత్సహించిందన్నారు. వాటిని ఇప్పుడు సుప్రీంకోర్టు ఉత్తర్వుల పేరుతో కొట్టేస్తున్నారని చెప్పారు. కొల్లేరులో విధ్వంసం ఆపాలంటూ ఢిల్లీలో 15 ఏళ్ల క్రితమే సిపిఎం పోరాటం జరిపిందని గుర్తుచేశారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి గ్రామాలను కాపాడి, అభివృద్ధిని చేపట్టి శాశ్వత పరిష్కారం చేపట్టాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇప్పటి-కై-నా ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసి వాస్తవ పరిస్థితులను కోర్టుకు వివరించాలని శ్రీనివాసరావు కోరారు. రెగ్యులేటర్ల నిర్మాణం చేపడితే వరదలను నివారించవచ్చునన్నారు. వన్య ప్రాణులను కాపాడాలని కోరారు. మూడో కాంటూరుకు కుదించినా టూరిజం అభివృద్ధికి బోలెడన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. ముందుగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు- చేసి ఇక్కడి ప్రజలకు అభయం ఇచ్చి కలిసికట్టు-గా ముందుకు సాగేలా చూడాలని ప్రభుత్వానికి సూచించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ.. పర్యావరణం ఉండాలంటే ముందు ప్రజలు ఉండాలన్నారు. 2006 ఆపరేషన్ కొల్లేరు సమయంలో జరిగిన పోరాటంలో సిపిఎం నాయకులను

# 400 మందికి పైగా అనుమానాస్పదుల గుర్తింపు

గాంధీనగర్, జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన నేపథ్యంలో భారత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులోభాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరవ్యాప్తంగా శనివారం క్రైమ్ బ్రాంచ్ అధ్వర్యంలో ముమ్మర తనిఖీలు, సోదాలు నిర్వహించింది. అందులోభాగంగా 400 మందికిపైగా అనుమానాస్పద వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించారు. వీరిలో 127 మంది బంగ్లా దేశీయులు అక్రమంగా దేశంలో నివసిస్తున్నట్లు గుర్తించారు. విచారణ అనంతరం వారి వారి ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించామని అహ్మదాబాద్ - బ్రాంచ్ డీసీపీ అజిత్ రాజియన్ వెల్లడించారు. అహ్మదాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ వలసదారులను పట్టుకోవడానికి ఈ కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ సోదాహరణంగా వివరించారు.జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. దీంతో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది.దాంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయారాష్ట్రాల్లో నివసిస్తున్న అక్రమ వలసదారులు మరి ముఖ్యంగా పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని వారిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అహ్మదాబాద్‌లో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ తగిన ఆధారాలను సేకరించింది. అందుకు సంబంధించిన ఆధారాలను భారత్‌లోని పలు దేశాల రాయబారులకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ అందజేసిన విషయం విదితమే.

### ఆత్మరక్షణలో పాక్ నేతలు...

ఇస్లమాబాద్, పహల్గాం దాడి వెనుకున్న కీలక సూత్రధాని పాక్‌కు ఝులకిచ్చేందుకు భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా దయాది దేశానికి భాతర్ గట్టి షాకే ఇచ్చింది. రాబోయే ముప్పును తలుచుకుని పాక్ రాజకీయ నేతలు మొదలు సామాన్యుల వరకూ ఇప్పుడు వణికి పోతున్నారు. అయినా మేకపోతు గాంభీర్యంతో బీరాలు పలుకుతున్నారు. చిక్కులు తప్పవని చింతిస్తున్నారు. ప్రధాని మోదీ బీహార్‌లో చేసిన ప్రసంగం తరువాత పాక్ నేతలు తమ నోటికి పనిచెప్పడం మొదలెట్టారు. ఉగ్రవాదులను ప్రపంచం అంచులవరకూ వెంటాడి అంతమొందిస్తామని ప్రధాని మోదీ బీహార్‌లో ప్రసంగించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులను, వారికి మద్దతు ఇచ్చే వారిని వదిలిపెట్టేది లేదని గట్టి వార్నింగ్ ఇచ్చారు. భారత్ చర్యలు పాక్‌కు భారీ షాకిచ్చాయనేందుకు సూచనగా అక్కడి పీపీపీ పార్టీ నేత బిలావాట్ భుట్టో జర్దారీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సింధూ నదీలో నీరు ప్రవహించకపోతే పాక్ ప్రత్యర్థుల రక్తం పారుతుందంటూ బిలావాల్ నోరు పారేసుకున్నారు. సింధూ నాగరికత పరిరక్షకులం తామే అంటూ భారత్‌కు హెచ్చరికలు జారీ చేశారు. సింధూ నది మాదే. ఎప్పటికీ మాదే. నదిలో నీరైనా పారుతుంది లేదా వారి రక్తమైనా పారుతుంది. పాకిస్థాన్ గానీ అంతర్జాతీయ సమాజం కానీ ఈ యుద్ధ కాంక్షను అస్సలు సహించదు. వేల ఏళ్ల నాటి సింధూ నాగరికతకు తాము వారసులమని మోదీ అంటుంటారు. కానీ ఈ సంస్కృతికి పరిరక్షకులము మేమే. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని అంటూ ఓ ర్యాలీలో ప్రగల్భాలు పలికారు. భారత్‌తో ఉద్రిక్తతలు మరింత ముదిరేలా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు. అంతకు మునుపు, పాక్ రక్షణ శాఖ మంత్రి కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్‌ల మధ్య సింధూ, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తూర్పున ఉన్న బియాస్, రావీ, సట్లజ్ నదుల్లోని నీళ్లపై హక్కులు భారత్‌కు, సింధూ నది, ఛెనాబ్, ఝెలమ్ నదుల నీళ్లు పాక్‌కు దక్కాయి. అయితే, పహల్గాం దాడి తరువాత పాక్ తగిన గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతో ఉన్న భారత్ ఈ ఒప్పందం అమలును నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ క్రమంలో సింధూ నది నీటిని భారత్ దిగువన ఉన్న పాక్‌కు విడుదల చేయకపోతే దాయాది దేశానికి షాక్ తప్పదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# పహల్గాం దాడితో మాకు సంబంధం లేదు

శ్రీనగర్, పహల్గాం దాడిపై కశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. టెర్రిస్టుల చర్యలపై ఇప్పుడు స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమ పొట్ట కొట్టారని, పచ్చిన కాశ్మీర్‌లో చిచ్చు పెట్టారని విమర్శలు చేస్తున్నారు. అమాయక టూరిస్టులను బలితీసుకోవడాన్ని కశ్మీర్ సమాజం ముక్త కంఠంతో ఖండించింది. ఈ నేపథ్యంలో లష్కరే తయ్యిబా అనుబంధంగా కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద బృందం 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ఊహించని యూటర్న్ తీసుకుంది. పహల్గాం దాడి తామే చేశామని తొలుత ఘనంగా ప్రకటించిన టీఆర్ఎఫ్.. ఇప్పుడు తమకు ఆ దాడితో ఏమాత్రం సంబంధం లేదంటూ తాజాగా ప్లేటు ఫిరాయించింది. హ్యాకర్ల కారణంగా ఈ ప్రకటన విడుదలైందని, దీని వెనుక భారత సైబర్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఉండొచ్చని కూడా పేర్కొంది. పహల్గాం దాడిలో మా పాత్ర అసలేమీ లేదు. దీన్ని మాకు ఆపాదించడం తప్పే కాకుండా తొందర పాటు చర్య అవుతుంది. తొలి ప్రకటనపై మేము అంతర్గత ముదింపు నిర్వహించాము. మా డిజిటల్ వేదికలపై సైబర్ దాడితో ఈ ప్రకటన వెలువడిందని గుర్తించాము. మా అనుమతి లేకుండా విడుదలైన ప్రకటన ఇది. సైబర్ దాడి ఎలా జరిగిందో తెలుసుకునేందుకు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించాము. అయితే, ప్రాథమిక ఆధారాలు మాత్రం భారతీయ సైబర్ ఇంటెలిజెన్స్ వర్గాలవైపు చూపిస్తున్నాయని అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ వాదనను బలపరిచేందుకు ఓ ఆడియో క్లిప్‌ను కూడా రిలీజ్ చేసింది. పహల్గాంలో 26 మంది అమాయక టూరిస్టుల హత్యకు తామే కారణంటూ టీఆర్ఎఫ్ తొలుత గర్వంగా ప్రకటించుకున్న విషయం తెలిసిందే. దీంతో, కశ్మీర్ ప్రజల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. పాకిస్థాన్‌పై, పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలపై స్థానికుల్లో ఆగ్రహం పెల్లుబికింది. 2023లో భారత ప్రభుత్వం టీఆర్ఎఫ్‌ను ఉపా చట్టం కింద ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చొరబాట్లను ప్రోత్సహించడం, మిలిటెంట్లను చేర్చుకోవడం, పాక్ నుంచి ఆయుధాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారంటూ టీఆర్ఎఫ్‌ను టెర్రరిస్టు సంస్థగా ప్రకటించింది. మరోవైపు, పహల్గాం దాడి తరువాత ప్రపంచదేశాలు భారత్‌కు మద్దతు ప్రకటించాయి. భద్రతా మండలి కూడా ఈ దాడిని ముక్త కంఠంతో ఖండించింది. నిందితులకు శిక్ష పడాల్సిందేనంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ సింధూ నదీ ఒప్పందం నిలుపుదల చేయడంతో పాక్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. రాబోయే నీటి ఎద్దడిని ఎలా తట్టుకోవాలో తెలీక అక్కడి నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. నీటిని ఆపడం యుద్ధ చర్యగా పరిగణిస్తామని చెబుతున్నారు.

# పాక్ కుంభస్థలం బద్దలే.. మ్యాప్ నుండి అవుట్..!




న్యూఢిల్లీ,సైన్యానికి సెలవులు రద్దు చేశారు! లీవుల్లో ఉన్నవాళ్లని వెంటనే రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు! పాక్ సరిహద్దుల్లో బలగాల మోహరింపు మొదలైంది. భారత త్రివిధ దళాలు అన్ని విధాలుగా సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే.. పాకిస్థాన్ బోర్డర్‌లో కాల్పులు మొదలయ్యాయి. ఇవన్నీ చూస్తుంటే దాయాది దేశంతో యుద్ధం ఖాయమేనా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు యుద్ధమే అనివార్యమైతే.. ఏం జరగబోతోంది? భారత్-పాక్ సైనిక బలమెంత? సమయం సరదా పడితే.. సమరంలో గెలిచేదెవరు?జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత మొత్తం పరిస్థితులే మారిపోయాయి. ఉగ్రవాదులను ఎగదోసి.. అమాయక టూరిస్టుల దేహాల్లోకి తూటాలను దించి.. దాయాది దేశం పాకిస్థాన్ ఎప్పటికీ క్షమించరాని తప్పు చేసింది. 2019లో పుల్వామా ఉగ్రదాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారు. ఆ ఉగ్రదాడి తర్వాత కశ్మీర్ లోయలో జరిగిన అత్యంత ఘోరమైన నరమేధం.. పహల్గామ్ ఉగ్రదాడి. మంచుకొండల్లో జరిగిన ఈ మారణహోమం తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. భారత్ మొత్తం అట్టుడికిపోతోంది. భారతీయులంతా ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు.

**బోర్డర్ లో ఏ క్షణం.. ఏమైనా జరగొచ్చనే అంచనా**

పాక్‌కు ఎప్పటికీ గుర్తుండిపోయేలా బుద్ధి చెప్పాలనే డిమాండ్లు మొదలయ్యాయ్. ఈసారి కొట్టే దెబ్బ ఎలా ఉండాలంటే.. ఇంకోసారి పాకిస్థాన్ సైన్యం గానీ, ఆ దేశం ఎగదోసే టెర్రరిస్టులు గానీ.. ఇండియా వైపు కన్నెత్తి చూడాలంటేనే.. ఒక్కొక్కడికి ఎకరం తడిసిపోవాలనేలా ప్రతీకారం తీర్చుకోవాలంటున్నారు. ఇప్పటికే వివిధ రకాలుగా పాకిస్థాన్‌పై చర్యలు తీసుకుంది భారత సర్కార్. పాక్‌ని ఎడారి చేసేందుకు.. వ్యూహాత్మకంగా సింధూ నది జలాలను ఆపేసింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ సరిహద్దుల్లో సైనిక సన్నద్ధతని పెంచింది. దాంతో.. భారత్ కూడా తన బలగాలను సరిహద్దుల్లో మోహరిస్తోంది. బోర్డర్‌లో ఏ క్షణం.. ఏమైనా జరగొచ్చనే అంచనాలున్నాయి.

**ఫుల్ యాక్షన్ మోడ్‌లోకి భారత త్రివిధ దళాలు**

ఇప్పటికే.. ఇండియన్ ఆర్మీ సెలవులు రద్దు చేసింది. లీవుల్లో వెళ్లిన వాళ్లని కూడా తిరిగి వచ్చి వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఇండియన్ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవీ.. ఇలా త్రివిధ దళాలన్నీ ఫుల్ యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. ముఖ్యంగా.. పాకిస్థాన్‌తో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా భారత్ రద్దు చేసింది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కి చెందిన రఫేల్, సుఖోయ్ 30 యుద్ధ విమానాలు కూడా సన్నద్ధమైపోయాయి. ఐఎన్ఎస్ విక్రాంత్ కూడా అరేబియా సముద్రంలోకి ఎంటరైపోయింది. భారత దళాలన్నీ.. ఇప్పుడు పాకిస్థాన్ వైపు కదులుతున్నాయి. దాంతో రెండు దేశాల సరిహద్దుల్లో హీట్ అమాంతం పెరిగిపోయింది. భారత్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని రద్దు చేయడంతో.. పాకిస్థాన్ అప్పుడే కవ్వింపు చర్యలు మొదలుపెట్టింది.

**యుద్ధం అనివార్యమైతే.. పాకిస్థాన్ తట్టుకోగలదా?**

అవతలి వైపు నుంచి పాక్ సైన్యం కాల్పులు జరుపుతోంది. భారత సైన్యం కూడా దీటుగా బదులిస్తోంది. మరోవైపు.. పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ కూడా తన యుద్ధ విమానాలను కరాచీలోని సదరన్ ఎయిర్ కమాండ్ నుంచి భారత సరిహద్దులకు దగ్గరగా ఉన్న లాహోర్, రావల్పిండి ఎయిర్‌బేస్‌లకు తరలిస్తోంది. ఈ వరుస పరిణామాలన్నింటిని చూస్తుంటే రెండు దేశాల మధ్య దాదాపు యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయనే చర్చ మొదలైంది. ఇదే సమయంలో.. ఇప్పుడు గనక ఇండియా-పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే.. ఎవరి బలమెంత? సైనిక బలగమెంత? అనే చర్చ కూడా సాగుతోంది. యుద్ధం అనివార్యమైతే.. ఇండియాని పాకిస్థాన్ తట్టుకోగలదా?

**9వ స్థానం నుంచి 12వ స్థానానికి పడిపోయిన పాకిస్థాన్**

గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్ ప్రకారం.. ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన సైన్యాల జాబితాలో భారత్.. నాలుగో స్థానంలో ఉంది. ఇదే సమయంలో పాకిస్థాన్.. తొమ్మిదో స్థానం నుంచి 12వ స్థానానికి పడిపోయింది. గ్లోబల్ ఫైర్ పవర్ ఇండెక్స్.. ఒక దేశం పోరాట సామర్థ్యాన్ని నిర్ణయించేందుకు.. ఆ దేశ జీడీపీ, జనాభా, సైనిక బలం, ఆయుధాలు, కొనుగోలు శక్తి లాంటి 60కి పైగా అంశాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ లెక్కన.. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధం గనక వస్తే.. రెండు దేశాల సైనిక బలం ఎంత అనే అంచనాలు మొదలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో భారతదేశ రక్షణ బడ్జెట్ 6 లక్షల 80 వేల కోట్లుగా ఉంది.

**సరికొత్త ఆయుధాలను సమకూర్చుకుంటున్న భారత్**

ఇది.. గత ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాల కంటే.. తొమ్మిదిన్నర శాతం పెరిగింది. ఇక పాకిస్థాన్ ఈ ఆర్థిక సంవత్సరంలో తన రక్షణ బడ్జెట్‌ని 159 బిలియన్ డాలర్లకు పెంచుతుందని రిపోర్ట్స్ చెబుతున్నాయ్. దేశ రక్షణ విషయంలో భారత్ ఎప్పటికప్పుడు సరికొత్త ఆయుధాలను సమకూర్చుకుంటోంది. అధునాతన ఆయుధ వ్యవస్థలను కొనుగోలు చేస్తోంది. యుద్ధం వచ్చినా, రాకపోయినా.. పక్కలో బల్లెంలా మారిన పాకిస్థాన్, చైనాని ఎప్పటికీ నమ్మటానికి వీల్లేదు. అందువల్లే.. భారత్ ఆయుధాల విషయంలో ఒక అడుగు ముందే ఉంటోంది. దాడికి ముందే సరైన వ్యూహంతో సిద్ధంగా ఉంటోంది.

**ఆ దేశాల సైనిక బలగమెంత? ఆయుధ బలమెంత?**

యుద్ధాన్ని వెతుక్కుంటూ ఆయుధాలు వాటంతట అవే వస్తాయనేది ఎంత నిజమో.. ఆయుధాలే యుద్ధాన్ని గెలిపిస్తాయన్నది కూడా అంతే నిజం. యుద్ధం గెలవాలంటే వ్యూహం ఒక్కటే సరిపోదు.. అధునాతన ఆయుధ వ్యవస్థలు కూడా కావాలి. రెండు దేశాల మధ్య ఎప్పుడు ఉద్రిక్త పరిస్థితులు మొదలైనా.. ముందుగా చర్చకు వచ్చేది.. ఆ దేశాల సైనిక బలగమెంత? ఆయుధ బలమెంత? అనే దాని గురించే! మరి.. పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ ఎంత స్ట్రాంగ్‌గా ఉంది?

**పాకిస్థాన్ దగ్గర 6 లక్షల 54 వేల మంది సైన్యమే ఉంది**

ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్.. త్రివిధ దళాల బలగాల విషయంలో భారత్-పాక్‌కు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. సైనికుల పరంగా చూస్తే.. భారత్ ప్రపంచవ్యాప్తంగా రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం ఇండియన్ ఆర్మీలో 14 లక్షల 55 వేల 550 మంది యాక్టివ్ ఫోర్స్ ఉంటే.. పాకిస్థాన్ దగ్గర 6 లక్షల 54 వేల మంది సైన్యమే ఉంది. భారత్ దగ్గర రిజర్వ్ ఫోర్సెస్ 11 లక్షల 55 వేల మంది ఉంటే.. పాకిస్థాన్ దగ్గర 2 లక్షల 80 వేల ఫోర్స్ మాత్రమే ఉంది. ఇక.. పారామిలిటరీ దళాల విషయానికొస్తే.. భారత్ దగ్గర 25 లక్షల 27 వేల మంది బలగాలు ఉండగా.. పాకిస్థాన్ దగ్గర 5 లక్షల పారామిలిటరీ దళం మాత్రమే ఉంది. మొత్తంగా చూసుకుంటే.. ఇండియా దగ్గర మిలిటరీ ఫోర్స్ 51 లక్షల 37 వేలకు పైగా ఉంటే.. పాకిస్థాన్ దగ్గర మొత్తం సైన్యం కలిపి 14 లక్షల 34 వేల మంది ఉన్నారు.

**యుద్ధ ట్యాంకుల్లోనూ.. భారత్ ఆధిపత్యమే కొనసాగుతోంది.**

యుద్ధ ట్యాంకుల్లోనూ.. భారత్ ఆధిపత్యమే కొనసాగుతోంది. మన దగ్గర 4 వేల 201 యుద్ధ ట్యాంకులు ఉండగా.. పాకిస్థాన్ దగ్గర 2 వేల 627 ఉన్నాయి. సాయుధ వాహనాలు భారత్ దగ్గర లక్షా 48 వేల 594 ఉన్నాయి.

# కార్పొరేట్ సంస్థలకు కళ్లెం...




న్యూఢిల్లీ,ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి. మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది. మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి.వర్తమాన పరిస్థితుల్లో ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు. ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది. ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది.కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి. అందుకు కావలసిన చట్టాలు తీసుకురావాలి. అనారోగ్యకర వ్యాపార పోకడలపై కఠినచర్యలుండాలి. బడా కార్పొరేట్ సంస్థలు తమ లాభాలను అపారంగా పెంచుకోవటం, అవి ప్రభుత్వాల్ని శాసించే స్థితికి ఎదగటం ప్రజాస్వామ్యానికి ముప్పు కలిగిస్తుంది. అందుకే ఈయూ చర్యల్ని స్వాగతించాలి.

# యూఎస్ విద్యార్థులకు భారీ ఊరట

వాషింగ్టన్,ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. వారి వీసాలు/ చట్టబద్ధ హోదాను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ట్రంప్ సర్కారు వెనక్కి తగ్గింది. ప్రధానంగా ఇటీవల కోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టింది. నిర్ణయాన్ని రద్దు చేసింది దీంతో ట్రంప్ సర్కార్ ఆ విద్యార్థుల లీగల్ స్టేటస్‌ను పునరుద్ధరించింది. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు. వీసాలు రద్దయిన వారిలో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే వారి చట్టబద్ధ హోదాను తొలగించినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1200 మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసింది. దీంతో డిపోర్టేషన్, నిర్బంధం ముప్పు పొంచి ఉండటంతో ఆ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. ఇంకొందరు క్లాసులకు వెళ్లడం లేదు. తమ వీసాల రద్దుపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది. సాధారణంగా వీసా లేదా చట్టబద్ధ హోదా రద్దయినప్పుడు.. విదేశీ విద్యార్థుల వివరాలను పొందుపర్చే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డేటాబేస్ నుంచి వారి వివరాలు తొలగిస్తారు. అయితే, ఈ రికార్డుల టెర్మినేషన్‌కు సంబంధించిన ట్రంప్ సర్కారు త్వరలోనే కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు తొలగించిన విద్యార్థుల రికార్డులన్నింటినీ తిరిగి యాక్టివేట్ చేస్తున్నట్లు- ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో ఆయా విద్యార్థులకు చట్టబద్ధ హోదా లభిస్తుందన్నారు.

# ఎందుకిలా?

అమరావతి,వైసీపీలో అంతర్గత కలహాలు, అక్కడి ఎమ్మెల్యే దూకుడుకు%ఔ%వైసీపీ కోట పేకగోడల్లా కూలిపోయింది. నిన్నటి వరకు తిరుగులేని ఆధిక్యంతో ఉన్న మున్సిపల్ పీఠాన్ని అక్కడి ఎమ్మెల్యే సునాయసంగా కదిలించేశాడు. చేజారుతున్న పీఠాన్ని కాపాడుకునేందుకు వైసీపీ నుంచి చేసిన ప్రయత్నాలు..కనీస ఫలితాన్ని కూడా ఇవ్వలేదట.తమ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లను అవిశ్వాస తీర్మాణానికి గైర్హజయ్యేలా చేసున్నా ఆ మున్సిపల్ పీఠం దక్కేదట. అసలెందుకు అక్కడ వైసీపీ అంత బలహీంగా ఉంది? టీడీపీ ఎమ్మెల్యే దూకుడుని ఎందుకు తట్టుకోలేకపోతోంది? మున్సిపల్ పీఠం చేజార్చుకోవడానికి కారణాలేంటి..? ఏపీలో ఉన్న మున్సిపల్ పీఠాలన్నీ ఒక్కొక్కటిగా కదిలిపోతూ కూటమిఖాతాలో చేరిపోతున్నాయి. అలా వైసీపీ మున్సిపల్ పీఠాలను చేతులారా చేజార్చుకుంటోంది. అధికారం ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో గెలవడం ఈజీనే అనుకున్న వైసీపీకి..అధికారంలో కోల్పోయిన తర్వాత వాటిని నిలబెట్టుకోవడం కష్టమవుతుందట. రాష్ట్రంలో వరుసగా మున్సిపాల్టీలను చేజార్జుకుంటున్న వైసీపీ..తాజాగా శ్రీసత్యసాయి జిల్లా కదిరి మున్సిపాల్టిని కూడా చేజార్చుకుంది.నిన్నటి వరకు ఇక్కడ తిరుగులేని ఆధిక్యంతో ఉన్న మున్సిపల్ ఛైర్ పర్సన్ నజీమున్నీసా..ఇప్పుడు మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ అయ్యారు. భారీ ఆధిక్యం ఉండి కూడావైసీపీ బలహీనతలు, ప్రస్తుతం అక్కడున్న ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ దూకుడు కలగలిపి. కొంపముంచిందన్న టాక్ జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తోంది.కదిరి మున్సిపాల్టీలో 36 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో వైసిపి 31 స్థానాల్లో గెలవగా, టిడిపి 5 స్థానాల్లో విజయం సాధించింది. సార్వత్రిక ఎన్నికల ముందే వైసిపికి చెందిన ఐదుగురు, ఒక ఇండిపెండెంట్ కౌన్సిలర్ టిడిపి గూటికి చేరారు. దీంతో మున్సిపల్ కౌన్సిల్లో టిడిపి బలం 11కి పెరిగింది. వైసిపికి 25 మంది మద్దతు ఉండగా వీరిలో 14 మంది తిరుగుబాటు జెండా ఎగురవేశారు.దీనికి ప్రధానమైన కారణంగా ఛైర్ పర్సన్ నజీమున్నీసా, ఆమె భర్త వ్యవహార తీరే అని అంతా అనుకుంటు న్నారట. ఛైర్ పర్సన్ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదంటూ సొంత పార్టీ కౌన్సిలర్లే అనేకసార్లు బహిరంగ విమర్శలు చేశారట. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఛైర్ పర్సన్ పై మరింత స్వరాన్ని పెంచారట. అంతే కాకుండా ఆమె రెండున్నరేళ్లకు పదవి నుంచి దిగి మరొకరికి అవకాశం ఇవ్వాల్సి ఉంది. కానీ అలా చేయకపోవడంతో స్వపక్షంలోనే విపక్షం తయారైందట.

**ఆయన అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారా?**

వైసీపీలో ఇంత గందరగోళ పరిస్థితులు ఉంటే ఇక్కడ సమన్వయకర్తగా ఉన్న మక్బూల్ ఏ మాత్రం పట్టించుకోలేదట. ఆయనపై కొన్ని భూ వివాదాలు ఉండడంతో కేసులు కూడా నమోదు కావడంతో అప్పటినుంచి అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారట. సరిగ్గా వైసీపీకి ఉన్న ఈ మైనస్సే కూటమికి బాగా కలిసొచ్చిందట. తెర వెనుక ఎమ్మెల్యే కందికుంటే ఈ మొత్తం వ్యవహారాన్ని నడిపించారట.కౌన్సిలర్లను క్యాంపుకు తరలించి..పక్కా వ్యూహంతో కథ నడిపించి..చివరకు ఛైర్ పర్సన్ ను దించి వేశారట. మొత్తం 25 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణానికి హాజరుకాగా..వైసీపీ చైర్ పర్సన్ పక్షాన నిలబడిన 11 మంది గైర్హాజరయ్యారు. 25 మంది ఛైర్ పర్సన్ కు వ్యతిరేకంగా ఓటు వేయడంతో ఆమె పదవి నుంచి కోల్పోయారు. అయితే త్వరలోనే మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనుంది. వీటిని కూడా కైవసం చేసుకునేందుకు కూటమి పావులు కదుపుతోందట.వైసీపీ వైఫల్యాల కారణంగానే ఇక్కడ ఛైర్ పర్సన్ పీఠం చేజారిందంటూ జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే కందికుంట లాంటి బలమైన నేత వేస్తున్న వ్యూహాలు చూసైనా వైసీపీ అధిష్ఠానం జోక్యం చేసుకొని ఉంటే బాగుండేదన్న టాక్ విన్పిస్తోంది. ఏది ఏమైనా వైసీపీ నుంచి మరో మున్సిపాల్టీ చేజారిపోయింది.ఇప్పటికే రాష్ట్రావ్యాప్తంగా మెజార్టీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకున్న కూటమి%ఔ%రాబోయే రోజుల్లో మిగిలిన మున్సిపల్ పీఠాలను కూడా తన ఖాతాలో కలిపేసుకునేందుకు ఇప్పటినుంచే ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ రాజకీయ వ్యూహాలకు పదును పెడుతోందట. మరి మిగిలిన మున్సిపల్ పీఠాలనైనా వైసీపీ కాపాడుకుంటుందా లేక వాటిని కూడా కూటమికి అప్పనంగా అప్పగించేస్తుందా అనేది చూడాలి.

### బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై కేసు

హైదరాబాద్,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిలు నకిలీ వీడియోలను విడుదల చేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. దీంతో గతేడాది మే 25న వారిద్దరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కెటిఆర్, జగదీశ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# కొత్త రేషన్ కార్డులు వచ్చేస్తున్నాయ్..




హైదరాబాద్,తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయడానికి అంతా సిద్ధం చేసింది. గ్రామ సభలను నిర్వహించి వారి నుంచి అర్జీలను తీసుకున్న తర్వాత అర్హులను నిర్ణయించింది. కొత్త రేషన్ కార్డు దారులను ఎంపిక చేయడం ద్వారా వారికి అన్నీ ఉచితాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా మే నెల నుంచి అందనున్నాయి. కొత్త రేషన్ కార్డు దారులందరికీ వారికి సంబంధించిన కార్డులను ఈ నెలాఖరులోపు మంజూరు చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇప్పటికే లబ్దిదారుల ఎంపిక పూర్తి కావడంతో పాటు మూడేళ్లు నిండిన వారిందరికీ మే నెల నుంచి కొత్త రేషన్ కార్డుపై ఆరు కిలోల సన్న బియ్యాన్ని పంపిణీ చేయనుంది.

లక్షల్లో దరఖాస్తులు...

గ్రామసభల ద్వారా మాత్రమే కాకుండా మీ సేవ కేంద్రాల ద్వారా కూడా లక్షల సంఖ్యలో ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. గత పదేళ్ల నుంచి తమకు రేషన్ కార్డు లేదని, తమ ఆర్థిక పరిస్థితిని చూసి అందించాలని వారు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వం కూడా అర్హులైన పేదలు ఎంత మంది ఉన్నా అందరికీ తెలుపు రంగు రేషన్ కార్డులు అందచేస్తామని తెలిపింది. దీంతో కుటుంబంలో ఎంతమంది సభ్యులున్నా, వారు పెళ్లిళ్లయి బయటకు వెళ్లిపోయినా వారి పేరు మీద కూడా కొత్త రేషన్ కార్డును మంజూరు చేయనున్నారు. కుటుంబంలో ఎంతమంది సభ్యులన్నప్పటికీ ఒక్కొక్కరికీ ఆరు కిలోల సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో వీటికి డిమాండ్ పెరిగింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు స్థానికత గుర్తింపుతో పాటు అనేక రకాలైన ధ్రువీకరణ పత్రాలను రేషన్ కార్డు మంజూరుకు అడిగే వారు. వాటి ఆధారంగానే జారీ చేసేవారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులన్నీ రద్దు చేసి ఆహార భద్రత కార్డులను జారీ చేయాలని నిర్ణయించింది. అయితే బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లు అది సాధ్యం కాలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించడంతో పాటు జనవరి 26వ తేదీన ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. మే నెలలో లబ్దిదారులు సన్న బియ్యం అందుకునే విధంగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలన్న ప్రభుత్వం ఆదేశం మేరకు మరో నాలుగు రోజుల్లోనే ఈ కొత్త రేషన్ కార్డుల జారీ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని లక్షల కుటుంబాలకు రేషన్ కార్డుల ద్వారా లబ్ది చేకూరనుంది.

# థియేటర్ల భవిష్యత్తుపై ఆందోళన.. అసలేం జరుగుతోంది?



హైదరాబాద్,ఈమధ్య కాలంలో థియేటర్లకు జనాలు రావడం లేదనే కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. అయితే ఎందుకు రావడం లేదనే విషయాన్ని మాత్రం అందరూ గ్రహించలేకపోతున్నారు. 100 సినిమాల్లో 10 సినిమాలు కూడా సక్సెస్ కావడం లేదనే వాదన గత 10 ఏళ్ళ నుంచి వినిపిస్తోంది. ఇది కేవలం ఒక టాలీవుడ్ లోనే కాదు.. ప్రపంచవ్యాప్తంగా అన్ని సినిమా ఇండస్ట్రీలలో ఇదే తీరు కనిపిస్తోంది. ఇటీవల బాలీవుడ్ లో విడుదలైన ఇమ్రాన్ హష్మీ నటించిన గ్రౌండ్ జీరో మూవీకి దేశవ్యాప్తంగా పట్రీయాటిజం వాతావరణం ఉండగా కూడా థియేటర్లలో ఆశించిన స్పందన రాలేదు. మొదటి రోజు కేవలం 1 కోట్లకు పైగా మాత్రమే వసూళ్లు రావడం పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.మంచి కథ ఉన్నా, సమకాలీన సంభ్రమం ఉన్నా ప్రేక్షకులు థియేటర్లను ఎంతగా దూరంగా ఉంచుతున్నారో ఇది మరోసారి రుజువు చేసింది. ఒకప్పుడు సినిమాలకు థియేటర్ అనేది తలపడని అనుభవంగా ఉండేది. కానీ ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌లు నిమిషాల్లో వినోదాన్ని అందిస్తున్నాయి. ప్రేక్షకులకు ఇంట్లోనే సినిమాలు, వెబ్ సిరీస్‌లు, షార్ట్ ఫిలిమ్స్ వంటి అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి.నెట్‌ఫ్లిక్స్ సీఈఓ చేసిన వ్యాఖ్యలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి.. హాలీవుడ్‌లోనూ థియేటర్ల వ్యవస్థ దాదాపు ముగింపు దశలో ఉందని అన్నారు. ఈ మార్పు బలంగా మన తెలుగు పరిశ్రమలో కూడా కనిపిస్తోంది. ప్రస్తుతం పెద్ద పండుగలు కాని, స్టార్ హీరోల సినిమాలు కాని వస్తే తప్ప, ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లడం చాలా అరుదైన విషయం అయిపోయింది. సాధారణ సినిమాలు విడుదలైతే, మంచి టాక్ వచ్చినా కూడా ప్రేక్షకులు “ఓటీటీలో వస్తుంది కదా” అని ఎదురుచూస్తున్నారు.ఇలా కొన్ని వారాల్లోనే ఓటీటీలో విడుదల అవ్వడం వల్ల థియేటర్ కాలక్షేపం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది. మరో పెద్ద సమస్య ఏంటంటే, ఇప్పుడు ఓటీటీలు కూడా ఫ్రైడే రిలీజ్ ట్రెండ్‌ను పాటిస్తున్నాయి. థియేటర్ల సినిమాలతో డైరెక్ట్‌గా పోటీ పడడం వల్ల, ఒకే రోజు కొత్త సినిమాలు, కొత్త వెబ్ సిరీస్‌లు వచ్చి ప్రేక్షకులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. కనీసం ఓటీటీ విడుదలలను సోమవారం నాటి ప్లాన్ చేస్తే, థియేటర్ సినిమాలకు మూడు రోజుల గడువు ఇచ్చినట్లయ్యేది. కానీ అలాంటి చర్యలు లేవు.ఈ పరిస్థితుల్లో థియేటర్ వ్యవస్థ మరింత సంక్షోభంలోకి నెట్టబడే ప్రమాదం ఉంది. అసలు వ్యాపారం మొత్తం ఓటీటీ, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లపై ఆధారపడే రోజులు రాబోతున్నాయి. ఒకప్పుడు థియేటర్ అనేది సంబరంగా ఉండేది. కానీ ఇప్పుడు, ఓటీటీలు ప్రతి ఇంట్లో ఒక సినిమాహాల్‌ను సృష్టించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. సినిమా ప్రేమికులు థియేటర్‌కు తిరిగి వచ్చే రోజులు మళ్లీ రావాలంటే, పరిశ్రమలో పెద్ద మార్పులు అవసరమే. లేదంటే.. త్వరలోనే థియేటర్‌లను గుర్తు చేసుకోవాల్సి వచ్చే పరిస్థితి తప్పదని అనిపిస్తోంది.

# రాజు గారి పై గంటా ఫైరింగ్... విషయమేంటి?



అమరావతి,ఏపీలో అధికార కూటమిలోని రెండు పార్టీలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య వివాదం రాజుకుంది. ఈ క్రమంలో ఇద్దరు నేతలు నడిరోడ్డుపై వాదులాడుకున్నారు. ఒకరు మరొకరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉంటే ఆ మరొకరు ఫైర్ అవుతున్న నేతకు సర్ది చెబుతున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విశాఖ జిల్లా పరిధిలోని భీమిలి ఎమ్మెల్యేగా టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కొనసాగుతుండగా విశాఖ నగర పరిధిలోని విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బీజేపీ సీనియర్ నేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. శనివారం వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రాజు గారి తీరుపై గంటా ఓ రేంజిలో ఫైరయ్యారు. అది కాదండి%ా% ఇది కాదండి అంటూ రాజు గారు ఆయనకు ఎంతగా సర్దిచెప్పినా గంటా ఏమాత్రం చల్లబడకపోవడం గమనార్హం.గంటా వర్సెస్ రాజు గారి మధ్య వివాదానికి కారణమేమిటన్న విషయానికి వస్తే.. విశాఖ ఫిల్మ్ నగర్ క్లబ్ గంటా నియోజకవర్గమైన భీమిలి పరిధిలోకి వస్తుంది. అయితే ఈ క్లబ్ లీజు విషయానికి సంబంధించి రాజు కలెక్టర్ కు ఓ వినతి పత్రాన్ని సమర్పించారట. ఈ వినతి పత్రంపై రాజుతో పాటు కూటమికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సంతకాలు చేశారట. వీరిలో టీడీపీ ఏపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు కూడా సంతకం చేశారట. వాస్తవానికి గంటా నియోజకవర్గ పరిధిలోని ఈ క్లబ్ కు సంబంధించిన విషయం కాబట్టి విషయం ఏదైనా గంటాకు విషయం తెలియజేయాల్సి ఉంది. అయితే రాజు మాత్రం ఆ విషయాన్ని ఎలా మరిచిపోయారో గానీ గంటాకు తెలియకుండానే ఈ వినతి పత్రాన్ని కలెక్టర్ కు సమర్పించారు. కలెక్టరేట్ సిబ్బంది ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న గంటా ఒక్కసారిగా ఆగ్రహానికి గురయ్యారు.ఈ క్రమంలో శనివారం తనకు తారసపడ్డ రాజును గంటా నిలదీశారు. ఇదేం పద్ధతి అంటూ ఆయనను ప్రశ్నించారు. ఇదేదో చేయి దాటిపోయేలా ఉందని భావించిన రాజు%ా% తాను మాత్రం ఆగ్రహానికి గురి కాకుండానే%ా% జరిగిన విషయాన్ని గంటాకు తెలియజెప్పేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఓ వైపున మీరు చేసింది ముమ్మాటికీ తప్పేనని గంటా విరుచుకుపడుతూ ఉన్నా.. సహనంతో సాగిన రాజు ”అదేదో అలా జరిగిపోయింది.. పొరపాటు అయ్యింది. సంతకాలు చేసిన వారి తప్పేమీ లేదు.. ఎంపీ గారికి తెలియజేసిన తర్వాతే ఈ దిశగా అడుగేశానుఇంత పెద్ద ఇష్యూ అవుతుందనుకోలేదు”..అంటూ సమాధానం ఇచ్చేందుకు యత్నించారు. అయినా కూడా గంటా ఏమాత్రం తగ్గలేదు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న తనకే తెలియకుండా తన నియోజకవర్గ సమస్యలపై మీరెలా వినతి పత్రం ఇస్తారంటూ ఫైరయ్యారు. మీ వరకు మీరు ఇచ్చి ఉంటే సరే అనుకుంటే అలా కాకుండా మరింత మంది ఎమ్మెల్యేలతో సంతకాలు ఎలా చేయిస్తారని మండిపడ్డారు.

# ఫైనాన్స్ కమిషన్ ఛైర్మెన్ గా స్మితా సభర్వాల్



హైదరాబాద్,తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటక సెక్రటరీ స్మితా సభర్వాల్‌ను ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా స్మితా సబర్వాల్‌కు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్‌గా శశాంక్ గోయెల్, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్, యాదగిరిగుట్ట ఈవోగా ఎస్. వెంకట్ రావు, కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిషోర్, ఫ్యూచర్ సిటీ కమిషనర్‌గా శశాంక, జెన్‌కో సీఎండీగా హరీష్, హెల్త్ డైరెక్టర్‌గా సంగీత సత్యనారాయణ, పరిశ్రమలు, పెట్టుబడుల సీఈవోగా జయేశ్ రంజన్, హెచ్ఎండీఏ సెక్రటరీగా ఇలంబర్తిలను నియమించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో మార్ఫింగ్ చేసిన ఫొటోను రీ ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్‌కు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

# అణుదాడి చేస్తారా ? మీరు ఐసిస్ వారసులు.. పాక్ పై రెచ్చిపోయిన ఓవైసీ..!



హైదరాబాద్,భారత్ పై అణుదాడి చేస్తామంటూ పాకిస్తాన్ చేస్తున్న బెదిరింపులపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. పాకిస్తాన్ ను ఐసిస్ వారసులుగా అభివర్ణించారు. భారత్ ను బెదిరించే పరిస్థితుల్లో పాకిస్తాన్ ఉందా అని ప్రశ్నించారు. సింధు జలాల నిలిపివేతపై పాకిస్తాన్ చేస్తున్న బెదిరింపులకు ఓవైసీ ఘాటు కౌంటర్ ఇచ్చారు.అమాయకపౌరుల్ని మతం పేరుతో చంపుతున్న ఐసిస్ తో పాకిస్తాన్ ను అసదుద్దీన్ ఓవైసీ పోల్చారు. పహల్గాంలో టూరిస్టుల్ని మతం ఏంటని అడిగి చంపారట, మీరు ఏ మతం గురించి మాట్లాడుతున్నారు ? మీరు పిరికివాళ్లకంటే దారుణం, ఐసిస్ వారసులు మీరు అంటూ ఓవైసీ తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత్ తో యుద్ధానికి అంత తొందరపడొద్దని, భారత్ సైనిక, ఆర్థిక బలంతో పాకిస్తాన్ ఏమాత్రం సరితూగలేదంటూ ఓవైసీ తేల్చిచెప్పారు.పాకిస్తాన్ భారత్ కంటే అరగంట మాత్రమే వెనుకబడి లేదని, అర్ధశతాబ్దం వెనుకబడి ఉందని ఓవైసీ గుర్తుచేశారు. మీ జాతీయ బడ్జెట్ కంటే మా మిలిటరీ బడ్జెట్ ఎక్కువన్న సంగతి గుర్తుపెట్టుకోవాలని సూచించారు. భారత్ ను అణుయుద్ధం పేరుతో బెదిరించడం కాదని, పొరుగు దేశంలో అమాయకుల్ని చంపుతుంటే ఎవరూ మౌనంగా ఉండరని తెలిపారు. భారత్ పై ప్రయోగించేందుకు ఘోరీ, షహీన్, ఘజ్నవీ సహా 130 అణు వార్ హెడ్లు సిద్ధంగా ఉన్నాయని పాకిస్తాన్ ఉప ప్రధాని హనీఫ్ అబ్బాసీ చేసిన విమర్శలకు ఓవైసీ కౌంటర్ ఇచ్చారు.మరోవైపు కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగం కాబట్టి అక్కడి ప్రజలను కూడా మన స్వంత ప్రజలుగా స్వీకరించాలని ఒవైసీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కోరారు. పహల్గామ్ దాడిని ప్రస్తావిస్తూ మోడీ చేసిన వ్యాఖ్యలు కాశ్మీరీల్ని లక్ష్యంగా చేసుకున్నట్లు ఉన్నాయని ఓవైసీ ఆక్షేపించారు. పహల్గాం దాడి తర్వాత ఇరు దేశాలూ మాటల యుద్ధానికి దిగాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకునే నిర్ణయాలకు అండగా నిలుస్తామని అఖిలపక్ష భేటీలోనే ఓవైసీ ప్రకటించారు.

# మద్యం ధరల పై పునరాలోచన - ఒకే రేటు, ఇక బార్లలోనూ..!!



అమరావతి,ఏపీలో మద్యం అమ్మకాల విషయంలో ఎక్సైజ్ శాఖ కొత్త ప్రతిపాదనలు చేసింది. నూతన బార్ పాలసీపై కసరత్తు మొదలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన విధానాల్లో మార్పులు సూచిస్తోంది. ఆగస్టుతో ముగియనున్న లైసెన్సుల గడువు ముగియనుంది. ఈ సారి ఫీజులు తగ్గించే యోచన చేస్తోంది. ఆదాయ నష్టం, అక్రమాల్లేని పాలసీ దిశగా కార్యాచరణ సిద్దం చేస్తూనే.. కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వం ముందు ఉంచుతోంది. అందులో భాగంగా మద్యం ధరల పైన పునరాలో చన చేస్తున్నట్లు తెలుస్తోంది.

నూతన పాలసీ

నూతన బార్ పాలసీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. పొరపాట్లు లేకుండా పక్కాగా అమలు చేయాలని భావిస్తోంది. అందులో భాగంగా పలు ప్రతిపాదనలపై అధ్యయనం చేస్తోంది. గతంలో వైసీపీ ప్రభుత్వం 2022లో వేలం నిర్వహించి బార్లు కేటాయించే విధానం తీసుకొచ్చింది. దాని గడువు ఈ ఏడాది ఆగస్టుతో ముగుస్తుంది. అప్పట్లో రూ.50 లక్షలు, రూ.35 లక్షలు, రూ.15 లక్షలతో మూడు శ్లాబులతో బార్ పాలసీ ప్రకటించి.. వేలం నిర్వహించి అత్యధిక ధరకు పాడిన వారికి కేటాయించారు. అంతకుముందు దాదాపు రెండు దశాబ్దాలుగా బార్లను రెన్యువల్ చేస్తూ వచ్చారు. దీంతో ప్రభుత్వాలు మారినా లైసెన్సీలు వారే ఉంటూ వచ్చారు. 2022లో వేలం ద్వారా కొత్త లైసెన్సీలను ఎంపిక చేసింది.

ధరల విషయంలో

పలువురు అతి భారీ ధరకు వేలం పాడి బార్లు దక్కించుకున్నారు. రూ.15 లక్షల కనీస ధర ఉన్న బార్‌ను రూ.70 లక్షల వరకు.. రూ.35 లక్షల బార్‌ను రూ.కోటికి పైగా పాడి వేలంలో దక్కించుకు న్నారు. కానీ అంతంత ఎక్కువ ఫీజులతో వ్యాపారంలో నష్టం రావడంతో అనేక మంది మధ్యలోనే లైసెన్సులు వదిలేసుకున్నారు. ఫలితంగా రాష్ట్రంలో ప్రస్తుతం 53 బార్లు ఖాళీగా మిగిలిపోయాయి. దీంతో, బార్లకు కొత్తగా లైసెన్సులు జారీచేయాలా.. ఇప్పుడున్న వారికే రెన్యువల్ చేయాలా అనేదానిపై ఆలోచన చేస్తోంది. బార్లకు మళ్లీ కొత్తగా లైసెన్సుల కేటాయింపు అంటే వ్యాపారులు ఎక్కువ మంది ముందుకు రాకపోవచ్చనే వాదన వినిపిస్తోంది. ఒకవేళ కొత్త లైసెన్సులు ఇవ్వాల న్న నిర్ణయం తీసుకుంటే.. ఈసారి ఎక్కువ కాలానికి లైసెన్సులు మంజూరు చేయాలనే ప్రతి పాదన కూడా వచ్చినట్లు తెలిసింది. రెన్యువల్ కాకుండా కొత్త లైసెన్సులు జారీచేయాలనుకుంటే లాటరీ లేదా వేలంలో కేటాయించాల్సి ఉంటుంది.

ధరలపై తాజా ఆలోచన

ఇప్పుడు ప్రైవేటు షాపులు రావడంతో వ్యాపారం ఎక్కువ లాభసాటిగా ఉండకపోవచ్చనే అభిప్రాయం బార్ల వ్యాపారుల్లో ఉంది. అందుకే ఈసారి లైసెన్సు ఫీజులు కూడా తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక, మద్యం షాపులు, బార్లకు ఎక్సైజ్ శాఖే మద్యం సరఫరా చేస్తుంది. అయితే షాపులతో పోలిస్తే బార్లకు 10 శాతం అదనపు ధరకు విక్రయిస్తుంది. బార్లు, షాపులకు ఒకే ధరకు మద్యం అమ్మాలని మద్యం వ్యాపారులు చాలాకాలం నుంచి డిమాండ్ చేస్తున్నారు. కొన్ని చోట్ల బార్ వ్యాపారులు షాపుల నుంచి మద్యం తీసుకొచ్చి అక్రమంగా విక్రయిస్తున్నారు. వీటిని అరికట్టాలంటే షాపులు, బార్లకు సరఫరా చేసే మద్యం ధరలు ఒకేలా ఉంచడం మేలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనల పైన మరింతగా కసరత్తు తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# వైసీపీ ఇప్పట్లో పుంజుకునేనా..



అమరావతి,అధికారం పోయి.. పదిమాసాలు దాటిపోయినా.. వైసీపీలో ఊపు, ఉత్సాహం ఎక్కడా కనిపించడం లేదు. నాడు యాక్టివ్‌గా ఉన్నవారే.. నేడు అసలు ఎక్కడా కనిపించడం లేదు. కనీసం.. వైసీపీ గురించి మాట్లాడు కునే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఒకప్పుడు.. ఏ ఇద్దరు కనిపించినా.. వైసీపీ గురించి.. జగన్ గురిం చిన చర్చ చేసేవారు. అదేసమయంలో నాయకుల దూకుడు.. మంత్రులు బూతుల గురించి కూడా.. చర్చ లు జరిగాయి.అయితే.. ఒక్కసారి అధికారిపోయిన తర్వాత.. వైసీపీ పాత్ర గురించి ఎక్కడా చర్చకు రావడం లేదు. ఎవ రూ పట్టించుకోవడమూ లేదు. ఈ విషయాన్ని స్వయంగా జగనే చెప్పడం గమనార్హం.

తాజాగా ఆయన రాయల సీమ నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు.. గమనిస్తే.. వైసీపీ పుంజుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదన్న భావన వ్యక్తమవుతోంది. ఏందబ్బా.. మన గురించి ఎక్కడా వినిపించడం లేదు. మీరు ఏం చేస్తున్నారు అని ఒకప్పుడు యాక్టివ్‌గా ఉన్నవారిని జగన్ ప్రశ్నించారు.అంతేకాదు.. తాను స్వయంగా వస్తే తప్ప.. ఎవరూ పుంజుకోరా? అని కూడా జగన్ ప్రశ్నించడం గమనార్హం. దీనిని బట్టి.. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. ఒకప్పుడు కావాలి జగన్.. రావాలి జగన్.. అని పాడిన నాయకులు.. ఇప్పుడు మౌనంగా ఉన్నారు. వీరి పేర్లుపెట్టి మరీ జగన్ గుర్తు చేయాల్సి వచ్చింది. అంటే.. పరిస్థితి ఎంత దిగజారిందో అర్థమవుతుంది. ఇక, రాజకీయాల్లో గెలుపు ఓటములను పక్కన పెడితే.. వైసీపీలో ఇంత నైరాశ్యానికి కారణం.. చాలా నే ఉందని అంటున్నారు.ప్రజల్లో ఉన్నవారిని పట్టించుకోకపోవడం.. ఎప్పటి నుంచో ఉన్న కారణమైతే.. ఇప్పుడు పనిచేసినా.. గుర్తిం పు ఉంటుందో ఉండదన్న భావన నాయకుల్లో ఉంటోంది. సడెన్‌గా నియోజకవర్గాలను మార్చేసి.. కొత్తవారి కి అవకాశం ఇవ్వడం.. బలమైన బ్యాక్ డ్రాప్‌గా చెబుతున్నారు. నిర్దేశిత నాయకులను కూడా.. తక్కువ చేసి చూడడం ఇబ్బంది కలిగిస్తున్న పరిణామం. దీంతో వైసీపీలో నాయకులు బయటకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ముందుగా ఈ వాదనను జగన్ ఖండించి.. నాయకుల్లో స్థయిర్యం నింపే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# విశాఖ వ్యవహారం చల్లబడినట్లేనా?




విశాఖ : ఉన్నట్లుండి బయటకు వచ్చింది. పెద్దగా క్రెడిబులిటీ కానీ, సత్తా కానీ లేని కంపెనీకి బోలెడు భూమి కట్టబెట్టింది కూటమి ప్రభుత్వం అనే వార్త. అది కూడా తెలుగుదేశం అనుకూల మీడియాలే బయటకు తీసుకువచ్చాయి. ఆ మీడియా సంస్థలే ఈ విషయంలో చాలా అత్యుత్సాహం ప్రదర్శించాయి. సవాళు ,ప్రతి సవాళ్లు అన్నట్లు సాగింది వ్యవహారం. పరిశధన వరకు వెళ్లింది. చిరునామాలు, వాటి వెనుక వైనాలు బయటకు లాగింది కూడా తెలుగుదేశం అనుకూల మీడియా సంస్థలే. ఇలాంటి టైమ్ లో వున్నట్లుండి సైలంట్ అయిపోయాయి సదరు తెలుగుదేశం అనుకూల మీడియా సంస్థలు అన్నీ. ఇదిగో ఇంకా రాబోతున్నాయి వార్తలు.. అదిగో మా పరిశోధన వైనాలు అంటూ బీరాలు పలికారు.ఈలోగా కేశినేని నాని రంగ ప్రవేశం చేసారు. ప్రతిపక్షాలు గొంతు కలపడం మొదలయింది. అంతే అంతలోనే ఏం జరిగిందో మొత్తం వ్యవహారం సైలంట్ అయిపోయింది. అలా అని ప్రభుత్వం ఏమైనా వెనక్కు తగ్గినట్లు వార్తలు వచ్చాయా అంటే అదీ లేదు. లేదా.. అవినీతి సహించను అని పదే పదే చెప్పే పవన్ కళ్యాణ్ గట్టిగా ఏమైనా అన్నారా అంటే అదీ లేదు. కానీ సదరు మీడియా సంస్థలు అన్నీ సైలంట్ అయిపోయాయి.చూస్తుంటే తెరవెనుక ఏవో ఆదేశాలు వచ్చినట్లే కనిపిస్తోంది. మన మీడియానే రచ్చ చేస్తే ప్రతిపక్షానికి అవకాశం ఇచ్చినట్లు అవుతుందని చెప్పారో, లేదా ఎవరైతే ఈ టోటల్ వ్యవహారం వెనుక వున్నారో వారు ఏమైనా రిక్వెస్ట్ చేసారో మొత్తం మీద టోటల్ వ్యవహారం సద్దు మణిగి పోయింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com